RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 320 ఆదివారం 14 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

### భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.



## ఉప్పల్ స్టేడియంలో మెస్సీతో మ్యాచ్..

# గోల్ కొట్టిన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' కొనసాగుతోంది. గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా మెస్సి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్‌ఆర్ టీమ్ తరపున మైదానంలో దిగిన సీఎం రేవంత్‌రెడ్డి గోల్ కొట్టారు. మెస్సి రెండో గోల్స్ రాబట్టారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్లతో కలిసి మెస్సి, రేవంత్ ఫొటోలు దిగారు. గ్యాలరీలో ఉన్న అభిమానులకు మెస్సి.. ఫుట్‌బాల్ కిక్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కుమారుడు, కుమార్తె ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు.




# ఘోర రోడ్డు ప్రమాదం..

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి..

మెదక్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట హైవేపై వెళ్తున్న బైక్ ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తుంది. చనిపోయిన వారి వివరాలు.. కూర్మ లింగయ్య (45), సాయవ్వ(40), సాయిలు (18), మానస(8). మృతులు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి గ్రామానికి చెందినవారిగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. రేపు (ఆదివారం) జరగబోయే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి తమ స్వగ్రానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. గతంలో కూడా పెద్దశంకరంపేటలో రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## మా డబ్బులు ఇచ్చేయండి.. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి కన్నీరు

నల్లగొండ, డిసెంబర్ 13: తెలంగాణలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల కోసం బరిలోకి దిగిన అభ్యర్థులు ఎంతో ఖర్చు పెట్టారు. తమను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను కోరారు. అంతేకాకుండా ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు భారీగా డబ్బులు ఖర్చుపెట్టారు. అయితే ఈనెల 11న మొదటి విడత ఎన్నికలు జరుగగా.. అదే రోజు ఫలితాలు వచ్చేశాయి. ఎన్నికల్లో గెలుస్తామనే ఆశతో.. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ కొందరు అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దీంతో ఓటమిపాలైన అభ్యర్థులు కన్నీరు పెట్టుకుంటున్న పరిస్థితి. చివరకు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బులను తమకు తిరిగి ఇచ్చేయాలంటూ ప్రాధేయపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఓ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల్లో ఓడిపోయాడు. దేవుడి ఫోటోతో ఇంటింటికీ తిరుగుతూ తన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నాడు. జిల్లాలోని నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ.. ఎన్నికల్లో ఓడిపోయానని ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని గ్రామస్తులను కోరుతున్నాడు. అయితే ప్రజలు మాత్రం అతడికే ఓటు వేసినట్లు చెబుతున్నారు. దీంతో ఓట్లు వేశామని చెబుతున్న ఓటర్లను దేవుడిపై ప్రమాణం చేయించుకుంటున్నాడు సదరు సర్పంచ్ అభ్యర్థి. అందరూ తనకే ఓట్లు వేస్తే ఎలా ఓడిపోయానంటూ ఓటర్లను నిలదీస్తూ కన్నీరు పెట్టుకుంటున్నాడు. ఈ ఎన్నికల కోసం రూ. 10 లక్షలకు పైగా ఖర్చు చేశానని బాధితుడు వాపోతున్నాడు. మరికొన్ని గ్రామాల్లో కూడా ఓడిపోయిన అభ్యర్థులు ఇలానే తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వకపోతే చచ్చిపోతామంటూ ఓడిపోయిన అభ్యర్థులు బెదిరిస్తున్నట్లు సమాచారం.



## రామేశ్వరం కేఫ్‌లో అఖిలేశ యాదవ్‌తో కేటీఆర్ భోజనం

హైదరాబాద్‌లోని రామేశ్వరం కేఫ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అఖిలేశ యాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భోజనం చేశారు. ఇరువురు నేతలకు కేఫ్ యజమాని శరత్ ఘనస్వాగతం పలికారు. భోజనం సందర్భంగా కేటీఆర్, అఖిలేశ్ యాదవ్ కేఫ్ రుచులను ఆస్వాదిస్తూనే రాజకీయ, సమకాలీన అంశాలపై చర్చించుకున్నారు. అదుతేమైన రుచులు అంటూ యజమాని శరత్‌ను అఖిలేశ్‌యాదవ్ అభినందించారు. భోజనం అనంతరం ఇరువురు నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి వెళ్లారు.

# డీకే కొత్త సీఎం... కర్ణాటకంలో కొత్త ముహూర్తం?

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయానికి క్లైమాక్స్ సీన్ దగ్గర పడింది అని అంటున్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే కొత్త ఏడాదిలో కొత్త సీఎం రావచ్చు అన్నది ఇపుడు అక్కడ వినిపిస్తున్న హాట్ టాక్ గా ఉంది. నిన్నటి దాకా సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ల మధ్య బ్రేక్ ఫాస్ట్ పాలిటిక్స్ నడిచింది. ఇపుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య విందు రాజకీయం స్టార్ట్ అయి శీతాకాలంలో సరికొత్త వేడిని పుట్టిస్తోంది.

**డీకే సీఎం అంటూ :** ఇదిలా ఉంటే కర్ణాటకలో శీతాకాల శాసనసభ సమావేశాలు ప్రస్తుతం మొదలయ్యాయి. అయితే ఈ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాల తరువాత కొత్త సీఎం గా డీకే శివకుమార్ బాధ్యతలు స్వీకరిస్తారు అంటూ ఇక్బాల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కర్ణాటకలో చర్చనీయాంశం అవుతున్నాయి.

**విందు రాజకీయం జోరు :** ఇక కర్ణాటకలో చూస్తే విందు రాజకీయాలు మొదలయ్యాయి. బేలాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రవీణ్ అన్న నాయకుడికి చెందిన ఫాం హౌస్ లో విందు రాజకీయం స్టార్ట్ అయింది. ఈ విందు సమావేశానికి మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఏకంగా 55 మంది దాకా హాజరయినట్లుగా చెబుతున్నారు. దాంతో అందరి ఫోకస్ ఈ మీటింగ్ మీద పడింది. ఈ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ మాట్లాడుతూ సీఎం మార్పు మీద చేసిన వ్యాఖ్యలతో ఈ సమావేశం అజెండా ఏమిటి అన్నది కూడా చర్చించుకుంటున్నారు. ఈ విందులోనే ఇక్బాల్ మాట్లాడుతూ తాను అందరికీ ఒక గుడ్ న్యూస్ చెబుతున్నాను అని చెప్పుకొచ్చారు. ఆ గుడ్ న్యూస్ డీకే శివకుమార్ తొందరలోనే ముఖ్యమంత్రి అవుతారు అని ఆయన చెప్పారు. ఆ మీదట ఆయన మీడియాతో కూడా మాట్లాడుతూ, తప్పకుండా డీకే శివకుమార్‌కు అవకాశం లభిస్తుందని ఆయన డ్యాం ష్యూర్ గా సీఎం అయి తీరుతారు అని జోస్యం చెప్పుకొచ్చారు.

**ఆయన పోరాటం అంటూ :** తాము అంతా కలసి విందు సమావేశం నిర్వహించడం తప్పు కానే కాదని ఇక్బాల్ అంటున్నారు. పైగా అందులో తప్పేం ఉందని ఆయన ప్రశ్నించడం విశేషం.

ఇక డీకే చేసినపోరాటం కృషి తప్పకుండా ఫలిస్తుందన్న నమ్మకం తమకు అందరికీ ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఇక తామంతా కలసి విందులో పాల్గొన్నామని అది సాధారణంగా జరిగే మీటింగ్





గానే చూడాలని అన్నారు. ఎలాంటి బల ప్రదర్శన అది కానే కాదని ఆయన చెప్పడం విశేషం.

**జోరు చేస్తున్న పాలిటిక్స్ :** ఇక్బాల్ తాజాగా చేసిన వ్యాఖ్యలతో కర్ణాటక రాజకీయం ఒక్కసారిగా ఊపందుకుంది. అంతే కాదు విందు రాజకీయాలు మరిన్ని జరిగే అవకాశాలు ఉండే చాన్స్ ఉంది అని అంటున్నారు. డీకే వర్గం విందు రాజకీయం చేస్తే సిద్ధరామయ్య వర్గం కూడా పోటీగా ముందుకు రావచ్చు అని అంటున్నారు. అయితే పెద్ద ఎత్తున కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒకే చోట సమావేశం కావడం ఇటీవల కాలంలో అతి పెద్ద రాజకీయ కుదుపుగా భావిస్తున్నారు దీంతో కాంగ్రెస్ హైకమాండ్ నుంచి ఏమైనా సంకేతాలు వచ్చాయా అన్నది కూడా అంతా చర్చిస్తున్నారు. దీంతో కర్ణాటకలో ఏమి జరుగుతుంది అన్న ఉత్కంఠ అయితే మొదలైంది.

# రసవత్తరంగా స్థానిక పోరు..

## తొలి విడత ఫలితాలతో ప్రధాన పార్టీలు అలర్ట్

## నేడు రెండో విడత పంచాయతీ పోలింగ్!




హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక పోరు రసవత్తరంగా సాగుతుంది. తొలి విడత సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో ప్రధాన పార్టీలు అలర్ట్ అయ్యాయి. అధికార కాంగ్రెస్‌కు సర్పంచ్ స్థానాలు అత్యధికంగానే వచ్చినప్పటికి బీఆర్ఎస్‌కు కూడా కొన్ని స్థానాలు రావడంపై టీపీసీసీ నేతలు రెండూ, మూడో దశ ఎన్నికలపై దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే హస్తం పార్టీ ముఖ్య నేతలు ఈ నెల 14, 17 తేదీల్లో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని నేతలతో మాట్లాడుతున్నారు. ఇంకా కొంచెం కష్టపడితే కాంగ్రెస్ ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల నేతలకు సూచిస్తున్నారు. రెండో విడత పోలింగ్‌కు మరొక రోజు మాత్రమే ఉన్నందున గెలుపుకోసం మరింత హార్డ్ వర్క్ చేయాలని చెబుతున్నారు. అధికార పార్టీకి సర్పంచ్ స్థానాలు ఎక్కువే వచ్చినప్పటికి, బీఆర్ఎస్‌కు ఊహించిన దాని కంటే తక్కువ సీట్లు రావడంతో ఆ పార్టీ నేతలు అలర్ట్ అయ్యారు. తాము మరింత ప్రోత్సహించి ఉండి ఉంటే కొంచెం బెటర్ రిజల్ట్స్ వచ్చేవని గులాబీ నేతలు అంతర్గతంగా చర్చించుకున్నట్లు సమాచారం. రెండు, మూడు దశల ఎన్నికల్లోని ఆయా ప్రాంత నేతలను ప్రోత్సహించే విధంగా వారు కసరత్తు చేస్తున్నట్లుగా తెలిసింది. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ రెండు పార్టీల నేతలూ మరింత ఎక్కువ సీట్లు సాధించాలని లక్ష్యంతో ఉన్నారు. రెండేళ్ల ప్రజా పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలు మరిన్ని కైవసం చేసుకోవాలని అధికార కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఇంచార్జీలను పార్టీ కీలక నేతలు హెచ్చరించినట్లుగా సమాచారం. గులాబీ పార్టీకి చెందిన అభ్యర్థులు గెలువకుండా.. కాంగ్రెస్ బలపరిచిన క్యాండిడేట్స్ అత్యధిక స్థానాల్లో గెలవాల్సిందేనని స్పష్టం చేసినట్లుగా తెలిసింది. తాము ఊహించిన దానికన్నా ఫలితాల్లో తేడా వస్తే ఉంటే బాగుండదని మరి కొందరికి కొంత ఘాటుగానే క్లాస్ ఇచ్చినట్టు సమాచారం. అధికార పార్టీకి కింది స్థాయిలోనే కేడర్ బలంగా ఉంటే రాబోయే రోజుల్లో వచ్చే అన్ని ఎన్నికల్లో సులువుగా గెలుపొందే ఆస్కారం ఉంటుందని సూచించినట్లు తెలిసింది. ప్రభుత్వం ద్వారా జరిగే పనులు కాంగ్రెస్ ద్వారా అవుతున్నాయనే విషయాన్ని గ్రామస్థాయిల్లోకి తీసుకెళ్లేది సర్పంచ్ లేనని గుర్తించాలని వారికి చెప్పినట్లు సమాచారం. ఎక్కడైనా రెబల్ అభ్యర్థులు ఉన్నా, టికెట్ల కేటాయింపుల్లో అసంతృప్తిగా ఉన్న వారిని బుజ్జగించాలని, అదే సమయంలో పార్టీ నుంచి వేరే పార్టీలోకి జంప్ కాకుండా, అవసరమైతే హస్తం గూటికే చేర్చుకునేలా ప్లాన్ చేసుకోవాలని పార్టీ పెద్దలు స్థానిక నేతలకు చెప్పినట్లుగా తెలిసింది.

**రచ్చ గెలిచి ఇంట ఓడిపోయిన ఎమ్మెల్యేలు..** రెండు లక్షలకు పైగా ఓట్లు ఉన్న నియోజకవర్గంలో గెలుపొందిన ఎమ్మెల్యేలు. వెయ్యి, రెండు వేల ఓట్లు ఉన్న సొంత గ్రామంలో మాత్రం గెలువలేక చతికిలపడ్డారు. తమ సొంతూర్లు గెలవలేకపోయారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గాలకు మకుటంలేని మహారాజులు వెలుగోతుందున్న శాసనసభ్యులు తమ సొంత గ్రామాల్లో ఓడిపోవడంపై ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సొంత ఊర్లో గెలవలేని వారు ఇక నియోజకవర్గంలో ఎలా పట్టుసాధిస్తారని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులుగా ఒక వెలుగు వెలగిన నేతలు సైతం తమ సొంత గ్రామంలో సర్పంచ్‌ని గెలిపించుకోలేకపోయారు. సంవత్సరాలుగా రాష్ట్ర నేతలుగా గుర్తింపు పొంది నేతలు సైతం సొంత గ్రామంలో బొక్కబోర్లా పడ్డారు. స్థానికంగా ఉండే రాజకీయాలు వేరు.. రాష్ట్ర స్థాయిలో ఉండే రాజకీయాలు వేరని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సొంత గ్రామంలో ఎమ్మెల్యే చెప్పినా వినని పరిస్థితులు ఉంటాయని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నేతలను కాకుండా తమ కుటుంబ సభ్యులను, కొత్త నేతలను తీసుకొచ్చి పోటీకి పెట్టే సరికి అప్పటి వరకు పనిచేసిన వారు తీవ్ర నిరాశ చెంది స్వతంత్రంగా బరిలో దిగుతున్నారు.

# సంపాదకీయం

## బంగ్లా చేసిన పిచ్చి పని...భారత్ ఆగ్రహం

భారతదేశం ఎంతో సహన వంతమైన దేశంగా చెప్పుకుంటారు. అందరూ బాగుండాలి అందులో తాను ఉండాలని నమ్మే దేశంగా ప్రపంచంలో పేరుంది. విశ్వానికి మిత్రుడు అన్న పదం ఒక్క భారత్ కే సరిపోతుంది. శతృవు అన్న మాట భారత్ వైపు నుంచి ఉండదు, తమ జోలికి ఎవరైనా వస్తేనే మూడో కన్ను తెరుస్తుంది. పాక్ దాయాదిగా ఉంటూ శతృవుగా మారినా కూడా భారత్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. మారాలని కోరింది అయినా వినిపించుకోక తన బుద్ధి చూపించుకోగ్వడంతోనే ఆపరేషన్ సింధూర్ లాంటి గట్టి ప్రయోగం చేయాల్సి వచ్చింది. అలాగే సింధు జలాలను నిలుపు చేసి పాక్ గొంతు ఎండబెట్టాల్సి వచ్చింది.

**ఊపిరి పోసిన చోట :** ఇక మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గురించి చెప్పాలంటే ఆ దేశం ప్రతీ రోజూ భారత్ పేరు తలచుకోవాల్సిందే అని అంటారు. ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్తే కనుక పాక్ కబంధ హస్తాల నుంచి తూర్పు పాకిస్తాన్ ని కాపాడి ఒక ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన మంచితనం భారత్ ది అని చెబుతారు. తూర్పు పాకిస్తాన్ ని అలా కనుక వదిలేసి ఉంటే ఈ రోజున బెలూచిస్తాన్ మాదిరిగా అన్ని విధాలుగా అణచివేతకు గురి అయి పాక్ చేతిలో హింస పడుతూ దిన దిన గండంగా ఉండేది. అంతకు ముందు కూడా మొదటి మూడు దశాబ్దాల పాటు అలాగే తూర్పు పాకిస్తాన్ హింసకు గురి అయింది భారత్ ని శరణు కోరడంతో న్యాయ సమ్మతంగా అది ఉండడంతో భారత్ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పాక్ తో యుద్ధం చేసి 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి నాంది పలికింది. ఒక కొత్త దేశం ప్రపంచ పటం మీద ఊపిరి పోసుకోవడానికి దోహదదం అయింది. అంతటితో ఊరుకోలేదు నిన్నా మొన్నటి వరకూ ఆర్థికంగా అన్ని విధాలుగా బంగ్లాదేశ్ ని ఆదుకుంటూనే వచ్చింది. కానీ గత ఏడాదిన్నరగా మారిన పరిణామాలతో బంగ్లాదేశ్ భారత్ కి శతవుగా మారిపోయింది.

**విషం చిమ్ముతూ :** తన ఒకనాటి శత్రువు అయిన పాక్ తో చేతులు కలిపి భారత్ మీద విషం చిమ్మడంతో పోటీ పడుతోంది బంగ్లాదేశ్. ఆ దేశం తాజాగా చేసిన పిచ్చి పనికి భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పాక్ కి టెంపరరీగా ఒక ప్రధాని ఉన్నారు. ఆయనే మహమ్మద్ యూనస్. ఆయన భారత్ మీద అదే పనిగా తన వ్యతిరేకతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా ఈ పెద్ద మనిషి ఇంకో సారి భారత్ పై తనకు ఉన్న అసూయను వ్యతిరేకతను చాటుకున్నారు. భారత్ కు చెందిన కీలకమైన భూభాగాలను బంగ్లాదేశ్ దేశం మ్యాప్ లో ఆయన చూపించారు. ఇది ఒక విధంగా బరితెగింపు అని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాదు చాలా గొప్పగా దానిని పాక్ నేస్తాలకు బహూకరించారు.

**పెడ ధోరణికి :** ఇదంతా బంగ్లాదేశ్ పెడ ధోరణికి నిదర్శనం అని అంటున్నారు తమది కానిది తమకు చెందనిది అయిన భూములను ప్రాంతాలను ఎలా కలుపుకుంటారు అని భారత్ లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇది దిగజారుడు తనం చౌకబారుతనం బరితెగింపు అని అంటున్నారు. ఈ విధంగా తయారు చేసిన మ్యాప్ ని ఆయన పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు ఇవ్వడం మరో రకమైన పైత్యానికి నిదర్శనంగా చూస్తున్నారు. ఇక బంగ్లా ఈ విధంగా రూపొందించిన మ్యాప్ లో చూస్తే భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అన్నీ ఉండడం గమనార్హం. వాటిని తమ సొంతంగా సొత్తుగా బంగ్లా తాత్కాలిక పాలకుడు చూపించుకుంటూ మురిసిపోవడం కంటే తెంపరితనం వేరొకటి ఉండదని అంటున్నారు

**బంగ్లాకు తగిన గుణపాఠం :** ఈ మధ్యనే పాకిస్థాన్ కు చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్ పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్ లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగానే ఆయనకు ఈ తాత్కాలిక ప్రధాని అయిన యూనస్ మహాశయుడు ఒక బుక్ ని ప్రజెంట్ చేశారు. ఆ బుక్ కి వేసిన కవర్ పేజి చిత్రంలో భారత్ లోని భూభాగాలను కలుపుకుంటూ ఉన్న మ్యాప్ లో ఉంది. భారత్ లో ఈశాన్యంలో ఏకంగా ఏడు రాష్ట్రాలు మావే అంటూ చేసిన ఈ మ్యాప్ ప్రదర్శన బంగ్లా బుద్దిని బయట పెట్టింది. అంతే కాదు పిచ్చి తనాన్ని బయటపెట్టింది అని అంటున్నారు. దీని మీద మొత్తం భారతదేశం ఆగ్రహంగా ఉంది. సమయం చూసి భారత్ బంగ్లాకు తగిన గుణపాఠం చెప్పాలని అంతా కోరుకుంటున్నారు.

## విద్యార్థులు దేశాభివృద్ధికి దోహదపడే ముందుకు సాగాలి : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ









శామీర్ పేట లోని ఐపీఈ క్యాంపస్లో నిర్వహించిన 2025 స్నాతకోత్సవం లో విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేసిన గవర్నర్

శామీర్ పేట, డిసెంబరు 13 ( గరుడ వార్త ) : దేశాభివృద్ధికి దోహదపడే విధంగాయువ విద్యార్థుల కార్యాచరణ ఉండాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం శామీర్ పేట పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆప్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ (ఐపీఈ) క్యాంపస్లో బోర్డ్ ఆఫ్ గవర్నింగ్ అధ్యక్షుడు మాధవరావు, డైరెక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్నాతకోత్సవం-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్నర్ పీజీడిఎం కోర్సులో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని మనుశ్రీ సంతోషిని గవర్నర్ అభినందిస్తు ఉజ్వల ముద్దన మెమోరియల్ బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని, పట్టా సర్టిఫికెట్ ను ప్రధానం చేశారు. అలాగే ఐపీఈ క్యాంపస్లో ఉత్తీర్ణులైన 530 మంది విద్యార్థులకు పట్టాలను అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ మన దేశం ఎంతో అద్భుతంగా నిర్మించబడిందని, దేశాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి వర్చడానికై విద్యార్థులు దోహదపడాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను వినియోగించుకుని అట్టడుగున ఉన్న ప్రజలను అభివృద్ధి పథంలోకి తీసుకరావడానికి విద్యార్థులు బాధ్యతగా కృషి చేయాలని గవర్నర్ తెలిపారు. సమ్మిళిత వృద్ధి, ఆర్థిక స్థిరత్వం సహాయంతో ఉద్దేశపూర్వక, ప్రతిష్టాత్మకమైన పథంలో 2047 వైపు దేశం పరుగులు తీస్తుందని చెప్పారు. లోతైన డిజిటల్ విప్లవం, అపూర్వమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి, పునరుత్పాదక శక్తిలో మార్గదర్శక పురోగతి, పరివర్తనాత్మక, సామాజికరంగ చోరవల తో ప్రతిష్టాత్మకంగా దేశం ముందుకు సాగుతుందని చెప్పారు. సమిష్టి కృషితో బలోపేతం చేయడంతో బలమైన, ఆర్గోకరమైన, స్థితిస్థాపక భారతదేశాన్ని నిర్మించాలని గవర్నర్ విద్యార్థులకు సూచించారు. ఐపీఈ గవర్నింగ్ బోర్డు అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులందరు భవిష్యత్తు వ్యవస్థాపకులుగా మారాలని ఆశా భావం వ్యక్తం చేశారు. విద్యార్థులు సమాజాభివృద్ధికి తోడ్పడాలని, ఇతరులలో అవగాహనను వ్యాప్తి చేయడానికి సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ను ఉపయోగించాలని ఆయన చెప్పారు. ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతు ఐపీఈ అవలంభిస్తున్న విభిన్న, వినూత్న బోధన పద్దతుల తో విద్యార్థులను అత్యున్నత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సమగ్ర ఆభ్యాస అనుభవాన్ని అందించే లక్ష్యంతో ఐపీఈ నిర్వహిస్తున్నవివిధ విద్యా కార్యక్రమాలను ఆయన తెలిపారు. తమ ఐపీఈ సంస్థ విద్యార్థులకు 90 శాతం ప్లేస్మెంట్ల ఉపాదిని కల్పిస్తు విద్యార్థుల విజయానికి తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐపీఈ బోర్డు సభ్యులు ప్రసాద్ రావు, మహర అలి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ విష్ణు, శివాలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, డిసెంబర్ 13 ( గరుడ వార్త) : శ్రీ విష్ణు, శివాలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. శనివారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని ఉద్దమర్రి అక్కన్న మాదన్నల నాటి శ్రీ విష్ణు, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వద్ద ఉద్ధమర్రి గ్రామానికి చెందిన లక్ష్మీ గారి నర్సింలు గౌడ్ వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు, రహదారి పై వెళ్లే భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల బీసీ వెల్ఫేర్ పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత





శామీర్ పేట, డిసెంబరు 13 ( గరుడ వార్త ) : శామీర్ పేట లోనున్న గురుకుల బీసీ వెల్ఫేర్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అడిగి తెలుసుకున్నారు. శనివారం శామీర్ పేట పరిధిలోని గురుకుల బీసీ వెల్ఫేర్ పాఠశాలలను మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింలు యాదవ్ తో కలిసి సందర్శించి పనితీరును పనిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. గురుకులాల్లో గత ఆరు నెలలుగా అరకొర వసతులతో పడుతున్న ఇబ్బందులను విద్యార్థులు వారికి వివరించారు. టాయిలెట్లలో డోర్లు, నీటి వసతి లేక తాము నిత్యం అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వారికి చెప్పారు. ఇద్దరు టీచర్లు మమ్మల్ని వేధిస్తు కొడుతున్నారని, బూతుమాటలు తిడుతున్నారని విద్యార్థులు వారి దృష్టికి తీసుకువచ్చారు. మెను ప్రకారం సరైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు పడుతున్న బాదలను చూడలేక వారు ప్రిన్సిపల్ రవికుమార్, టీచర్ గోపాల్ ను మీరేమ్ చేస్తున్నారని, మీ బాధ్యతలను ఎందుకు నిర్వర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి విద్యార్థులకు సమస్యలు పునరావృతమైతే మీపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. గురుకులాల్లో విద్యార్థులను సమస్యలను తాము బాధ్యతగా పరిష్కరించుటకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దగ్గు.. జలుబు సమేత.. జ్వరాల మోత

నల్గొండ: జిల్లాలో గత వారం రోజులుగా సీజనల్ వ్యాధులతో రోగులు పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడం, ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించకపోవడంతో అన్ని వర్గాల వారు వణికిపోతున్నారు.

**ఏయే వ్యాధులంటే:** జ్వరం, జలుబు, దగ్గు, ఆస్తమా, తలనొప్పి, చర్మవ్యాధులు, ముక్కు, చెవిగొంతు వంటి సీజనల్ వ్యాధులతో పాటు బీపీ, చక్కెర వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్నారు.



పెరిగిన ఓపీ: 10 ఏళ్లలోపు చిన్నారులతో పాటు 50 ఏళ్లు దాటిన వృద్ధులు ఎక్కువగా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మర్రిగూడ ఏరియా ఆసుపత్రుల్లో వారం నుంచి ఓపీ 400 నుంచి 600, ఐపీ 70 నుంచి 200 వరకు ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో గతం కంటే 50 శాతం ఓపీ పెరిగిందని వైద్యాధికారులు చెబుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి
ప్రస్తుతం జలుబు, దగ్గు, ఆస్తమా, జ్వరం వంటి వ్యాధులతో రోగులు ఎక్కువగా వస్తున్నారు. అన్ని ఆసుత్రుల్లో వైద్యులు, సిబ్బంది సరిపడా ఉన్నారు. అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశాం. మందులు, ఇంజెక్షన్లు సరిపడా ఉన్నాయి.

## ఫిర్యాదులకు యాప్‌సోపాలు

సూర్యాపేట : పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సిటిజన్ బడ్డీ' యాప్ వినియోగం కొరవడింది. అవగాహన లేమి, అధికారుల నిర్లక్ష్యమే ఇందుక్కారణమవుతోంది.

సిటిజన్ బడ్డీ యాప్‌లో నమోదు: యాప్‌ను చరవాణిలోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి నల్గొండ జిల్లా పురపాలక సంఘాల పేరుతో ఈ యాప్ అందుబాటులో ఉంది. ఆయా మున్సిపాలిటీల పరిధిలోని సమస్యలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. పట్టణ పౌరులు తీసుకొచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత విభాగం అధికారికి చేరవేయాలి. పౌరసేవ కేంద్రానికి రావడానికి వీల్లేని ప్రజలకు ఫోన్ నంబరు అందుబాటులో ఉంచాలి. వీటితోపాటు పట్టణంలోని రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, అడ్మినిస్ట్రేషన్, మెప్మా విభాగాలతోపాటు వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది ఫోన్‌నంబర్లు ఉంటాయి.




అమలుపై నిర్లక్ష్యం: ఈ యాప్ అమలుకు ప్రతి పురపాలిక కార్యాలయంలో ఒక అధికారి, సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఫిర్యాదుల స్వీకరణకు నియమించిన ఆపరేటర్‌ను ఇతర కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. కొంతమంది ఫిర్యాదు చేసినా వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు ప్రచార లోపం నెలకొంది. యాప్‌లో సమస్య నమోదు చేసిన వెంటనే సంబంధిత విభాగాల సిబ్బంది నిర్దిష్ట వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి సమస్యలు పరిష్కారం కావటం లేదు. ఇక నుంచి యాప్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని పురపాలికల కమిషనర్లుకు తెలిపారు.

## పొత్తాల గని.. కొలువుల చుక్కాని

భానుపురి : సూర్యాపేట గ్రంథాలయం నిరుద్యోగులకు కొలువుల బాట పరుస్తోంది. పోటీపరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఉండటంతో ప్రైవేటులో శిక్షణ పొందకుండా ఇక్కడ సాధన చేసి ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఏటా పదుల సంఖ్యలో వివిధ రకాల కొలువులు పొంది ఉన్నతంగా స్థిరపడుతున్నారు. ఇక్కడ వివిధ భాషలకు సంబంధించి మొత్తం 28,676 పుస్తకాలు ఉన్నాయి. పురుషులు, మహిళలు, చిన్నారులు 4,133 మంది సభ్యులు ఉన్నారు. గడచిన మూడేళ్లలో 90 మంది వరకు వివిధ పోటీ పర్క్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించారు.

సభ్యత్వం ఉన్నవారు
పురుషులు 3412
మహిళలు 687
పిల్లలు 34 మూడేళ్లుగా వచ్చి చదువుకున్నా
వి.శ్రవణ్ కుమార్, అనంతారం, పెన్‌పహాడ్ మండలం
ూర్యాపేట గ్రంథాలయంలో 2021 నుంచి మూడేళ్లపాటు అనంతారం నుంచి వచ్చి డీఎస్సీకి సన్నద్ధమయ్యాను. ఇక్కడ పోలీసు, గ్రూప్-1, 2, 3, 4, గురుకుల, ఉపాధ్యాయ కొలువుల సంబంధిత పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు చదివి విజయం సాధించాను. నాతోపాటు ఇంకా 30 మంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. నేను డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించి పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురంలో పనిచేస్తున్నాను.
లైన్‌మెన్ ఉద్యోగం సాధించానుహనీఫ్, సూర్యాపేట 2022 నుంచి వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఇక్కడికి వచ్చి పుస్తకాలు చదివాను. 2023లో లైన్‌మెన్ ఉద్యోగం సాధించాను. ఇందుకు జిల్లా గ్రంథాలయంలోని పుస్తకాలు దోహదపడ్డాయి. అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు, ఫ్రీ వైఫైతోపాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఇలాంటివి పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోకరంగా ఉంటాయి.

# కళ తప్పిన కూడళ్లు

మెదక్ : మెదక్ పట్టణంలో కూడళ్ల సుందరీకరణ ప్రకటనలకే పరిమితమైంది. ప్రధాన మార్గమైనా నర్సాపూర్-మెదక్-బోధన్ రోడ్డు విస్తరణలో నర్సాపూర్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్, రాందాస్ చౌరస్తాలో శివాజీ, అంబేడ్కర్, గాంధీ, ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో అంబేడ్కర్, మరో చౌరస్తాలో ధ్యాన్‌చంద్ విగ్రహాలను తొలగించి కూడళ్లను విశాలం చేశారు. అయితే అభివృద్ధి పనులను విస్మరించారు. దీంతో వాటిల్లో పొదలు పెరుగుతున్నాయి. మరికొన్ని పశువుల ఆవాసాలకు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటుకు, ప్రైవేట్ వ్యక్తుల ప్రచార బోర్డులకు అడ్డాగా మారుతున్నాయి.

**ప్రకటనలతో సరి**

అసెంబ్లీ, పురపాలిక ఎన్నికల సమయంలో చౌరస్తాలను అందంగా తీర్చిదిద్ది, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అనంతరం పట్టించుకోవడంలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారంలోకి వచ్చిన వెంటనే చౌరస్తాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచడంలేదు. అభివృద్ధిని రాందాస్ చౌరస్తా నుంచే



ప్రారంభిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చిత్రాలను కూడా చూపించారు తప్పితే అడుగు ముందుకు పడలేదు. పట్టణానికి చెందిన ప్రముఖులు, యువకులు కమిటీగా ఏర్పడి డబ్బులు పోగు చేసుకొని రాందాస్ చౌరస్తాలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ పచ్చదనాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు.

**ఎన్‌వోసీ రాగానే పనులు చేపడతాం**

– శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్

పట్టణంలోని ప్రధాన రోడ్డు ఎన్‌హెచ్ శాఖ పరిధిలో ఉండడంతో ఆయా కూడళ్లలో సుందరీకరణ పనులు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు వారి నుంచి అనుమతులకు లేఖ రాశాం. వారి నుంచి (ఎన్‌వోసీ) అనుమతి రాగానే పనులు చేపడుతాం.

# అక్రమ రవాణా.. అడిగే వారేరి!

జహీరాబాద్ : సులభంగా.. పారదర్శకంగా అన్న నినాదంతో ఆన్‌లైన్ పర్మిట్ల జారీ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసింది. అదే సమయంలో అక్రమ రవాణాపై నిరంతర నిఘాకు మొబైల్ స్క్వాడ్‌లు, ఈ-ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ కొనసాగుతుందని ప్రకటించింది. అయితే కొత్త విధానం మాత్రం అమలుకు నోచుకోలేదు. చెక్‌పోస్టులు ఎత్తేసి నెల దాటినా సంచార వాహన తనిఖీలు జాడ లేకపోవడం గమనార్హం. 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఏఎన్‌పీఆర్ (ఆటో నంబర్ ప్లేట్ రీడర్) ఎక్కడా కనిపించడం లేదు. అడిగే వారు లేక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

**ఐదు దశాబ్దాల పాటు..**

అక్రమాల అడ్డగింతకు రవాణా శాఖ చెక్‌పోస్టులు వెలిశాయి. ఆయా చోట్ల ఎంవీఐలు, ఏఎంవీఐలు ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఘటనలు అనిశా సోదాల్లో వెలుగుచూశాయి. ఈ కారణంగా ఐదు దశాబ్దాలుగా కొనసాగిన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి శివారు హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు అక్టోబరు 22న తొలగించారు.

**నిరంతరం తనిఖీ చేస్తామని..**

ఆన్‌లైన్ ద్వారా ఆదాయం ఆర్జించేలా రవాణా శాఖ సంచార వాహన తనిఖీ (మొబైల్‌స్క్వాడ్)లను ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. కానీ



ఇంతవరకు వాటి జాడే లేదు. చెక్‌పోస్టులు తొలగించాక అత్యాధునిక ఏఎన్‌పీఆర్ (ఆటో నంబరు ప్లేట్ రీడర్) కెమెరాలు బిగిస్తామని చెప్పిన కార్యరూపం దాల్చలేదు. అనుమతి తీసుకోకుండా వచ్చే వాహనాలను గుర్తించేలా పర్యవేక్షణ ఎక్కడా లేకుండా పోయింది. ఫలితంగా 65వ జాతీయ రహదారితో పాటు అంతర్రాష్ట్ర దారులు జహీరాబాద్-బీదర్, జహీరాబాద్-చించోళి-గుల్బర్గా మార్గాల్లో నిఘా కరవైంది.

**యథేచ్ఛగా తరలివెళ్తూ..**

జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఎక్కువగా సరకు రవాణాతో పాటు ట్రావెల్స్ బస్సులు, మినీ బస్సులు, ట్యాక్సీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాటికి తాత్కాలిక అనుమతి పత్రాలు ఇచ్చేవారు. సరకు వాహనాలను క్షుణ్నంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడక్కడ అధికారులు లేరు. దీంతో జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. ముంబయి, గోవా తీర ప్రాంతాల నుంచి పన్ను ఎగ్గొట్టిన అలంకరణ సామగ్రి, మొబైల్స్ సహా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, నిషేధిత రసాయనాలు తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు..**

అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టు ఎత్తివేయడంతో అక్రమ రవాణాపై దృష్టి సారిస్తాం. అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే సీసీ కెమెరాలు బిగించనున్నాం.

– వెంకటరమణ, ఉప కమిషనర్, ఉమ్మడి జిల్లా రవాణా శాఖ

# ప్రజా రవాణా.. ఆరోగ్య, ఆర్థిక ఖజానా!



హైదరాబాద్ : ఐటీ, విద్య, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మహానగరంలో లక్షలాది మంది ప్రజలు వేర్వేరు రవాణా సదుపాయాలను వినియోగిస్తున్నారు. ఇంధన వినియోగం భారీగా పెరిగి కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. ఫలితంగా వాయునాణ్యత క్షీణించి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తక్కువ మంది ఎక్కువ వాహనాలు వినియోగించడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని, ప్రజా రవాణా వినియోగిస్తే ట్రాఫిక్, కాలుష్య సమస్యలను నివారించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**1.2 లక్షల క్యాబ్ వాహనాలు..**

2025 మార్చి 31 నాటికి రాష్ట్రంలో 1,44,215 మోటార్ క్యాబ్‌లు ఉన్నట్టు నమోదవగా మహానగరంలోనే 80 శాతం అంటే 1,15,000 వరకుంటాయి. గత 8 నెలల్లో మరో 5వేల వాహనాలు పెరిగి ఉంటాయని అంచనా. 30 కి.మీ.ల ప్రయాణం కారుతో కాకుండా మెట్రో రైలులో చేస్తే 98 శాతం ఉద్గారాలను తగ్గించొచ్చు. డీజిల్ బస్సులతో పోల్చితే ఎలక్ట్రిక్ బస్సుల్లో 60 శాతం తక్కువ ఉద్గారాలు విడుదలవుతున్నాయి. అందుకే ఆర్టీసీ 3వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. 300 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.

**వాహనాలు పెరిగే కొద్దీ..**

మెట్రో రైలులో 1000 మంది, బస్సులో 50 మంది, కారులో నలుగురు, ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణించొచ్చు. అంటే 1000 మంది ప్రయాణానికి 20 బస్సులు, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాలు అవసరం. ఇలా వాహనాల సంఖ్య పెరిగే కొద్దీ కర్బన ఉద్గారాలు పెరుగుతున్నాయని, బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లనే అందరూ వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ట్రాఫిక్ సమస్యలకు చెక్**

వాహనదారులు ఏటా 85 గంటలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారని నెదర్లాండ్‌కు చెందిన ఓ టెక్నాలజీ సంస్థ చేసిన అధ్యయనంలో తేలింది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రజా రవాణాను వినియోగిస్తే రోడ్లపై వాహన సాంద్రత 20 నుంచి 30 శాతం తగ్గుతుందని, తద్వారా ప్రయాణ సమయం తగ్గుతుందని సూచించింది.

**చవకైన ప్రయాణం..**

నగరంలో అందుబాటులో ఉన్న రవాణా సదుపాయాలతో పోల్చితే ప్రజా రవాణా 30 శాతం చౌకగా ఉంటుంది. 16 కి.మీ.ల ప్రయాణానికి బైక్ టాక్సీకి రూ.160, ఆటోకి రూ.220, కారుకు రూ.250 ఖర్చవుతుంటే ఆర్టీసీ బస్సులో ఛార్జీ రూ.45 - రూ.50 మాత్రమే.

# పేలుతున్న 'పగ'



హైదరాబాద్ : నిఘా వైఫల్యంతో రాజధానిలో తూటా పేలుతోంది. నడిరోడ్డు మీద రౌడీషీటర్లు, పాత నేరస్థులు కత్తులతో పరస్పరం దాడులు చేసుకుంటూ హతమారుస్తుంటే.. రియల్‌ఎస్టేట్ తగాదాలు, భూ వివాదాల్లో కాల్పులు కలకలం రేపుతున్నాయి. పాతకక్షలు, సెటిల్‌మెంట్లలో మాట వినకపోతే కొందరు తూటాతోనే పగ తీర్చుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి మూడో వారంలో అఫ్జల్‌గంజ్‌లో బ్యాంకు దోపిడీతో మొదలై.. తాజాగా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో రియల్టర్‌ను కత్తులతో నరికిన ఆరుగురు.. కోపం చల్లారక తుపాకీతోనూ కాల్చి చంపారు. గతంలో తుపాకీ సంస్కృతి పాత నేరస్థులు.. దొంగల ముఠాలకు పరిమితమైన వ్యవహారంగా ఉండేది. ఇప్పుడు కొత్తగా నేరాలు చేయాలనుకునేవారు కూడా ఇతర రాష్ట్రాల నుంచి తుపాకులు తెప్పించుకుని ప్రత్యర్థుల ప్రాణాలు తీస్తున్నారు. ఒకవైపు మూడు కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు నాకాబందీలు, ఆకస్మిక తనిఖీలతో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా.. క్షేత్రస్థాయిలో నిఘా వైఫల్యంతో తుపాకులు పేలుతున్నాయి.

**కూలీలే.. ఏజెంట్లు**

జైళ్లల్లో ఖైదీలు, దొంగల ముఠాల మధ్య పరిచయాలు తుపాకుల రవాణాకు బాటలు వేస్తున్నాయి. హైదరాబాద్‌కు ఎక్కువగా బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి దేశవాళీ తుపాకులు దిగుమతి అవుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఆంగ్లేయుల కాలంలో తుపాకుల తయారీ పరిశ్రమల్లో పనిచేసినవారు స్వాతంత్ర్యం తర్వాత అక్రమంగా ఆయుధాల తయారీని కొగిసాగించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలా నడుస్తోంది. నగరానికి ఉపాధి కోసం వచ్చే ఉత్తరాది కూలీలకు నేరగాళ్లు కమీషన్లు ఆశచూపి తుపాకులు తెప్పిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ విభాగాలు ఈ గుట్టుమట్లను కనిపెట్టి కుట్రల్ని భగ్నం చేస్తున్నా.. పూర్తిగా కట్టడి కావటం లేదు. గచ్చిబౌలి ప్రిజం పబ్బులో కాల్పులు జరిపిన ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్.. ఔటర్ వద్ద ప్రాక్టీస్ చేసినా.. గుర్తించలేకపోయారు.

**రైళ్లు.. ప్రైవేటు బస్సులు**

నామమాత్రపు తనిఖీలు.. అసాంఘిక శక్తుల కదలికల మీద నిఘా తక్కువగా ఉండటం తుపాకీ సంస్కృతికి ఆజ్యం పోస్తోంది. నగరానికి రైళ్లు, ప్రైవేటు బస్సుల్లో తనిఖీలు తక్కువే. నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్, చర్లపల్లి తదితర ప్రధాన రైల్వే స్టేషన్లలో కచ్చితంగా తనిఖీలు ఉంటాయి. తుపాకులు రవాణా చేసే ముఠాలు నగరానికి దూరంగా చిన్న స్టేషన్లలోనే దిగిపోతున్నాయి.

**ఇటీవలి ఉదంతాలు**

గతేడాది బాలాపూర్‌లో రౌడీషీటర్ ఖాజా రియాజుద్దీన్‌ను కొందరు కాల్చి చంపారు. నిందితులు లఖ్‌నవూ నుంచి రూ.40 వేలకు తుపాకీ తెప్పించారు.

ఈ ఏడాది జులైలో మలక్‌పేటలో సీపీఐ నేత చందునాయక్‌ను మిత్రుడు రాజేశ్ తుపాకీతో అంతమొందించాడు. పాత కక్షలతో ప్రత్యర్థి వర్గం తుపాకీతో కాల్చిచంపారు. రూ.13 లక్షల వివాదం, అక్రమ సంబంధం వ్యవహారంలో ఈ దారుణం చోటుచేసుకుంది.

# 'రామా.. శాశ్వత' స్వాగతం పలికేదెన్నడు..?



భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో వార్షిక ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందులో రెండు ప్రధాన వేడుకలకు రావాలని భక్తులకు ప్రత్యేకంగా స్వాగతం చెబుతుంటారు. ఇందులో శ్రీరామనవమికి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఉంటాయి. దాదాపు అదేస్థాయిలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ముక్కోటి ఉత్సవాలు చేస్తుంటారు. ఈ క్రతువులకు విశేష సంఖ్యలో యాత్రికులు తరలివచ్చి తీర్థయాత్ర ఆనందాన్ని పొందుతుంటారు. సుదూర ప్రయాణం చేసినవారు ఊరి పొలిమేరలోకి రాగానే ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించేది స్వాగతమే. భద్రాచలానికి ఆనుకుని ఉన్న సారపాక గ్రామం వైపు, స్థానిక ఫైర్ స్టేషన్ ఎదుట, సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో శాశ్వత ద్వారాలు ఉన్నాయి. మిగతావన్నీ తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా ఉత్సవాల తరుణంలోనే కనిపిస్తుంటాయి.

**దూరదృష్టి అవసరం**

ఏడాదిలో వచ్చే రెండు ప్రధాన వేడుకలకు తాత్కాలిక స్వాగత ద్వారాల నిమిత్తం రూ.5 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నిత్య కల్యాణం, పచ్చతోరణంతో విలసిల్లుతున్న భద్రాచలంలో ప్రతిరోజూ స్వాగతం పలికేందుకు శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి. ఈమేరకు గతంలో చర్చలు సాగినప్పటికీ నిధుల లేమితో క్షేత్రస్థాయిలో పనులు చేయటం కుదరలేదు. దేశ, విదేశాల నుంచి భద్రాచలంలోకి ఏ మార్గంలో వచ్చినా వారిని ఆత్మీయంగా ఆహ్వానించేందుకు స్థానిక శిశుమందిర్ రోడ్డు, రాజుపేట రోడ్డులో శాశ్వత నిర్మాణాలు అవసరం. ప్రధాన రహదారి కావటంతో ఆ నిబంధనల ప్రకారం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గోదావరి కరకట్ట మార్గం, రాజవీధి, మార్కెట్ సెంటర్ వంటి చోట్ల వీటిని ఏర్పాటు చేస్తే మరింత శోభ వస్తుంది.

**ఒక్కో ద్వారానికి రూ.కోటి కావాలి**

జిల్లా కేంద్రం కొత్తగూడెంలోనూ శాశ్వత స్వాగతం పలికితే చక్కని ప్రచారం లభిస్తుంది. అందువల్ల రామాలయానికి రద్దీ పెరిగి ఎంతోమందికి ఆలయ ఆధారిత ఉపాధి లభిస్తుంది. ఇందుకు దాతలు, జిల్లాలోని పెద్ద పరిశ్రమలను ఒప్పిస్తే ఫలితం ఉంటుంది. ఒక్కో ద్వారానికి రూ.కోటి వరకు వెచ్చించాలి.

సీతారాములవారి విగ్రహాలు, చిత్రపటాలు, రామాయణ దృశ్యాలను ముఖ్య కూడళ్లలో ఉంచితే అంతా రామమయంగా కనిపించి భక్తులకు సంతోషం కలిగిస్తుంది.

గతంలో శాశ్వాత స్వాగత ద్వారాల ఏర్పాటు నిమిత్తం ప్రతిపాదనలు రూపొందించామని రామాలయం అధికారి ఒకరు తెలిపారు. నిధుల కొరత వల్ల కార్యరూపం దాల్చటం లేదన్నారు.

# అధికారి బదిలీ.. కట్టేశారు ప్రహరీ

హైదరాబాద్ : ప్రభుత్వ భూములపై కన్నేసిన అక్రమార్కులు అదునుచూసి కబ్జా చేశారు. ఘట్‌కేసర్ మండలం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి సమీపంలోని కొర్రెముల రెవెన్యూ పరిధి చౌదరిగూడలో రూ.10 కోట్ల విలువైన 2వేల గజాలను ఆక్రమించారు. తొమ్మిదేళ్ల నుంచి ఆక్రమణకు ప్రయత్నిస్తుంటే..అప్పటి తెదేపా నేత రేవంత్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా.. స్వయంగా ఆయన ఆందోళన చేపట్టారు. కబ్జాలకు గురికాకుండా రక్షించారు. తాత్కాలికంగా ఆగిన ఆక్రమార్కులు సమయం కోసం ఎదురుచూస్తున్నారు. సదరు ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేసిన ఘట్‌కేసర్ తహశీల్దార్ విజయలక్ష్మి



ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో ఆ బోర్డులను తొలగించి రెండు రోజుల్లో 2వేల గజాలను ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు.

**సర్కారు భూముల్లో లే-అవుట్లు..**

ఓఆర్‌ఆర్, జాతీయ రహదారి రెండూ కలిసి రావడంతో చౌదరిగూడలోని సర్వే నంబర్ 867లో పదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఆరేళ్ల క్రితం లేఅవుట్ చేసి అమ్మేశారు. కాంగ్రెస్ నాయకులు అప్పట్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. తెదేపా తరఫున రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఐదు మంది స్థిరాస్తి వ్యాపారులపై ఘట్‌కేసర్ ఠాణాలో కేసు నమోదయ్యింది. అప్పటి నుంచి కబ్జాలు ఆగిపోయాయి. చౌదరిగూడ గ్రామం పోచారం మున్సిపాలిటీలో విలీనం కావడంతో అక్రమార్కులు మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సర్వే నంబర్ 867లో 100 గజాల స్థలంలో గృహ నిర్మాణానికి అధికారికంగా అనుమతులు ఇచ్చారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో అక్రమార్కులు లే-అవుట్లు చేసి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఘట్‌కేసర్ తహశీల్దార్ అక్కడ ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు. ఆమె బదిలీ కాగానే చకచకా పావులు కదిపి ఆక్రమణకు తెరతీశారు.

# జాగా చూస్తారు.. పాగా వేస్తారు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. ముందుగా షెడ్డు వేసి.. కబ్జా చేసేస్తున్నారు. కన్నాల శివారులో ఇటీవల ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అయినా సర్వే నెంబరు 60, 112లో ఇంకా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టణంతోపాటు మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా ఇప్పటి వరకు ఆక్రమణదారులపై అధికారులు ఒక్క కేసు నమెదు చేయలేకపోయారు.

**రడగంబాలబస్తీలో అయిదెకరాలు..**

పట్టణంలోని రడగంబాలబస్తీలో అయిదెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఇక్కడ తాత్కాలిక షెడ్లను పూర్తిగా రేకులతో నిర్మిస్తున్నారు. దట్టంగా ఉన్న ముళ్లపొదల మధ్యలో రేకుల షెడ్లను వేసి భూములను ఆక్రమిస్తున్నారు. కొంతమంది నేతలు గుంటకు రూ.లక్ష చొప్పున విక్రయిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికిప్పుడు నివాసముండే పరిస్థితులు లేకున్నా స్థలం దక్కుతుందనే ఆశతో నిరుపేదలు కొనుగోలు చేసి



నష్టపోతున్నారు. నిత్యం ఇక్కడ ఏదో చోట ఘర్షణలు, పంచాయితీలు చోటు చేసుకుంటున్నాయి. దీని పక్కనే గతంలో రాజీవ్‌గృహకల్ప ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు.

పర్యవేక్షణ కరవై..

రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో నిత్యం కబ్జాల పర్వం కొనసాగుతోంది. అధికారులు కొన్ని చోట్ల కూల్చివేస్తున్నా.. అక్రమార్కులు మాత్రం ఆపడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారం, అర్థ బలం ఉంటే చాలు రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లడానికి జంకుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం.. : కృష్ణ, తహసీల్దార్**

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. రడగంబాలబస్తీలో సర్వే నెంబరు 170లో ఆక్రమణలను తొలగిస్తాం. ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తాం. ఇప్పటికే పట్టణంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం.

# ఖాజాగూడ.. కబ్జా బడా

రాయదుర్గం: ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, ఐటీ క్షేత్రాలకు కూతవేటు దూరంలోని ప్రభుత్వ స్థలమది. ఎకరం విలువ రూ.175 కోట్ల వరకు ఉంటుంది. అధికారుల ఉదాసీనత కారణంగా ఆక్రమణదారులు చెరపట్టారు.

ఇదీ పరిస్థితి.. ఖాజాగూడ సర్వే నంబరు 40లోని ప్రభుత్వ స్థలం సంరక్షణలో అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. సమీపంలోని దివ్యశ్రీ ఐటీ పార్కు వెనక మరో ఎకరం స్థలం ఉంది. ఏళ్లుగా ఈ స్థలాలు ఖాళీగా ఉండటంతో వివిధ రకాల వృక్షాలు, పొదలు పెరిగాయి. కుందేళ్లు, నెమళ్లు, వివిధ రకాల పాములు జీవనం సాగిస్తూ జీవ వైవిధ్యాన్ని చాటుతున్నాయి. క్రమబద్ధీకరణ జీవోల ముసుగులో ఈ స్థలంలో 490 గజాల చొప్పున ఐదు, 470 గజాల ఒక ప్లాట్లకు కన్వీన్స్‌డీడ్‌లు ఇచ్చారు. ఇందుకోసం అప్పటి అధికారులు కబ్జాదారుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. కంచె నిర్మాణ పనులు సాగుతుండగా, గతేడాది 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దాంతో కంచె పనులు నిలిచిపోయాయి. అనంతరం క్రమబద్ధీకరణ ప్రక్రియ సైతం ఆగిపోయింది. అప్పటి నుంచి స్థలం పరిరక్షణకు అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టలేదు. తాజాగా కబ్జాదారులు కంచె నిర్మించి స్థలాన్ని ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## మురుగు నీరు శుద్ధిచేసి.. మూసీలోకి వదిలేసి

హయత్‌నగర్ : చుక్క మురుగు చెరువులోకి చేరకుండా... వర్షపు, శుద్ధి చేసిన నీరే చెరువులోకి చేర్చి.. అటు నుంచి నేరుగా మూసీలోకి చేర్చడానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. 2036 జనాభా లక్ష్యంగా ఎస్టీపీ(మురుగు శుద్ధి కేంద్రం)లను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవుటర్ రింగ్‌రోడ్డులోని పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ పరిధిలో మూడు, తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలో ఒకటి నిర్మించడానికి రూ.165.95 కోట్లు విడుదల చేశారు. ఈ పనులతో నగరానికి తూర్పు భాగంలోని బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, సాహెబ్‌నగర్, హయత్‌నగర్ సహా దాదాపుగా పాతికకు పైగా కాలనీల నుంచి దిగువనున్న కుంట్లూర్, పసుమాముల చెరువులోకి శుద్ధి చేసిన నీటిని తరలించడా



నికి చర్యలు తీసుకుంటారు..

**భవిష్యత్తులో మురుగు సమస్య తలెత్తదు**

ఎస్టీపీల నిర్మాణంతో భూగ ర్భ, చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకుంటా యని అపోహ చెందొద్దు. 2036, 2051 ఏళ్ల వరకు కాలనీలు, జనాభాకు అనుగుణంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యం. పకడ్బందీగా కాంక్రీట్‌తో నిర్మాణం చేస్తాం.మురుగు చెరువులో కలువకుండా చర్యలు, తీసుకుంటాం.

వినోద్‌కుమార్, డీజీఎం, ప్రాజెక్టు-1 జలమండలి

## గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్

హైదరాబాద్: అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీహబ్‌కు గూగుల్ కూడా తోడవడంతో గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానానికి మార్గం ఏర్పడింది. రాయదుర్గం లోని టీహబ్‌లోని ఆరో అంతస్తులో జోన్-4లోని పదివేల అడుగుల విస్తీర్ణంలో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచాన్ని మార్చే తదుపరి తరం కంపెనీలు ఇక్కడ ఇంక్యుబేట్ కాబోతున్నాయి. తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు, ప్రపంచస్థాయి ఆవిష్కరణలను కేంద్రంగా మారనుంది. మహిళా వ్యవస్థాపకులకు, టైర్-2 ఆవిష్కర్తలు, విశ్వవిద్యాలయాల్లోని ప్రతిభకు గూగుల్ నిపుణుల తోడ్పాటు లభిస్తుంది. ఇక్కడ స్టార్టప్‌ల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించారు. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఏఐ, మెషిన్ లెర్నింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. అంకుర సంస్థల కోసం ప్రత్యేక డెస్క్‌లు, సమావేశ గదులు, ప్రత్యేక క్యాబిన్‌లు, క్యూబిక్‌లు,



డిజిటల్ తెరల వంటి సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. ఎంపికైన ఆలోచనలకు ఉచితంగానే ఇక్కడ స్థలం కేటాయిస్తారు. వర్చువల్‌గా ప్రపంచంలోని వ్యవస్థాపకులతో, నిపుణులతో నెట్‌వర్క్ అందిస్తుంది. ఏఐ, డీప్ టెక్నాలజీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. 'స్టార్ట్, బిల్డ్, గ్రో' అనేది వీరి నినాదం. ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాంగణాన్ని, అందులో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణలో అంకురాలకు సంబంధించి ఆసక్తికర గణాంకాలను వెల్లడించారు.

2024లో ఇక్కడి స్టార్టప్స్ 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 160 శాతం అధికం. మెడికల్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదైంది.

దేశంలోనే మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ ఆరోస్థానంలో ఉంది. వీరి ఆధ్వర్యంలో ఏర్పాటైన 531 అంకుర సంస్థలు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి.

గ్లోబల్ క్యాపబుల్ సెంటర్లు గత ఏడాది 70 వస్తే.. ఈ ఏడాది ఇప్పటికే 75 దాటాయి. 100 చేరుకోవడం లక్ష్యం.

## పల్లెలు గజగజ



జగిత్యాల : ఉత్తర భారతం నుంచి వీస్తున్న చలిగాలులు ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. బుధవారం తెల్లవారుజామున రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నాలుగు జిల్లాల్లోనూ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.6 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గింది. దీంతో పగలు కూడా చలి వాతావ రణం నెలకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొం టున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలివీ.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో 9.3, చింతకుంట ఏఆర్‌ఎస్‌లో 9.6 డిగ్రీలుగా నమోదయ్యాయి.

# అక్రమాల్లో సబ్‌రిజిస్ట్రార్లు



హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అవినీతి దాహం ముందు నిబంధనలు వెలవెలపోతున్నాయి. సబ్ రిజిస్ట్రార్లకు ఉన్న విచక్షణాధికారాలను వినియోగించుకుని అక్రమాలకు తెరతీస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసేద్దాం తర్వాత ఏమైతే అది కానీ అనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా భారీ మొత్తంలో లంచాలు మేస్తున్నారు. వీరికి కొందరు డాక్యుమెంట్ రైటర్లే దళారులుగా వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో ఆస్తుల విలువ, భూ వివాదాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు, డాక్యుమెంట్లలో లోపాలు, వివాదాస్పద ఆస్తులు, యజమానులు స్థానికంగా లేకపోవడం, జీపీఏ ద్వారా రిజిస్ట్రేషన్.. ఇలాంటి వేర్వేరు అంశాలను అవకాశాలుగా మలచుకుని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అవినీతికి తెరతీస్తున్నారు. ఇటీవల ఏసీబీ అధికారులు గ్రేటర్ పరిధిలో పలు కార్యాలయాల్లో కార్యకలాపాలపై నిఘా పెట్టి, పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఎల్‌బీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అంతర్గత పరిశీలన చేసింది. ఈ పరిశీలనలో పలు అంశాలను గుర్తించినట్లు తెలిసింది.

**అక్రమాలు ఎన్నో..:**

అనధికార వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లతో పాటు దళారుల ప్రమేయం చాలాచోట్ల సీసీ టీవీలు పనిచేయడంలేదు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండదు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

అత్యవసర రిజిస్ట్రేషన్‌ల పేరుతో వసూళ్లు

ఈసీ, వాల్యుయేషన్ సర్టిఫికెట్, సెర్చ్ రిపోర్టులకు వసూళ

మార్కెట్ విలువలో మార్పులు. వాస్తవమైన మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ చూపడం, అండర్ వాల్యూయేషన్‌చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించడం అంశాల్లో భారీగా వసూళ్లు.

ఎలా ఉన్నా రిజిస్ట్రేషన్ ఇలా..

నకిలీ జీపీఏ, సేల్‌డీడ్‌లు, పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా..


యజమానులు నిజమైనవారేనా అని నిర్ధారించుకోకుండా

డూప్లికేట్ లేఅవుట్‌లు, నకిలీ సర్వే నెంబర్ల ఆధారంగా

భవన నిర్మాణ అనుమతులకు భిన్నంగా ఉన్నా

అనధికార ఫ్లోర్‌లలోని ప్లాట్లకు సైతం.

# ఆధ్యాత్మికం.. ఆహ్లాదం



మల్యాల : కొండగట్టు అంజన్న ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని దేవాదాయ శాఖ అధికారులు దృఢ సంకల్పంతో ముందుకు సాగుతుండగా మరోవైపు కొండపై అటవీ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో ఆ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించారు. కొండగట్టు గుట్టలపై అటవీ శాఖకు సంబంధించి దాదాపు వెయ్యి ఎకరాల భూములున్నాయి. వీటిలో టేకు తదితర చెట్లు దట్టంగా పెరిగాయి. దాదాపు 22 ఎకరాల్లో ఆలయం, పరిసరాలు విస్తరించాయి. గతంలో ప్రభుత్వ ఆధీనంలోని 363.22 ఎకరాల అసైన్డ్ భూములన్నింటినీ రెవెన్యూ శాఖ నుంచి ఆలయానికి స్వాధీనం చేశారు.

**సమన్వయంతో బహుళ ప్రయోజనాలు**

ఆలయ పరిసరాల్లోని ఆరెకరాల్లో చేపట్టిన పలు నిర్మాణాలు, ఖాళీ స్థలం అటవీ ప్రాంతానికి చెందినదేనంటూ కొన్ని నెలల క్రితం ఆ శాఖ ఉన్నతాధికారులు ఆలయ అధికారులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమైంది. అయితే అటవీ అధికారులే ఆలయానికి చెందిన స్థలం నుంచి గిరి ప్రదక్షిణ దారిని ఏర్పాటు చేశారని, ముందుగా అటవీ భూముల వివరాలను గెజిట్ ద్వారా వెల్లడించిన తర్వాతే పనులు చేపట్టాలని ఈవో శ్రీకాంతరావు వారికి నోటీసులు పంపడం చర్చనీయాంశమైంది. ఇటీవల అటవీ భూముల సర్వేను కూడా ఆలయ అధికారులు అడ్డుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో అటవీ, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కరించుకుంటే కొండగట్టు ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని భక్తులు కోరుతున్నారు.

**చేపట్టే పనులు ఇవీ..**

రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా కొండగట్టు విరాజిల్లుతుండటంతో ఆలయ పరిసరాలకు ఆనుకొని ఉన్న తమ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇటీవల అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ కొండగట్టుకు వచ్చిన సందర్భంగా ఈ విషయమై అధికారులతో చర్చించి వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే 'వై' జంక్షన్ సమీపంలోని అటవీ భూమిలో కుటీరాన్ని నిర్మించారు. ప్రస్తుతం కొండగట్టులోని అటవీ ప్రాంతంలో కిలోమీటరు మేర నడక దారిని ఏర్పాటు చేయడంతో పాటు రూ.6 లక్షలతో నాలుగు చోట్ల కల్వర్టులు నిర్మించారు.

కొండగట్టు గిరి ప్రదక్షిణ దారిని విస్తరించనున్నట్లు తెలిసింది. గతంలో అటవీ ప్రాంతంలో వాచ్‌టవర్‌ను ఏర్పాటు చేయగా, ఆలయ ఈవో కార్యాలయ భవనం వెనుక వైపున రూ.16 లక్షలతో మరో 'వాచ్‌టవర్' నిర్మాణం చేపట్టారు.

అటవీ ప్రాంతానికి చెందిన స్థలాన్ని రూ.57 లక్షల వ్యయంతో చైన్ లింకింగ్ మెష్‌తో రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రధాన ద్వారం ఏర్పాటు చేయనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.

పర్యాటక ప్రదేశాలు తిలకించేందుకు వీలుగా బ్యాటరీతో నడిచే వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులకు జారుడు బల్లలు, ఊయలలు, ఇతర క్రీడా సామగ్రిని సమకూర్చనున్నట్లు పేర్కొంటున్నారు.

కొండగట్టు అర్బన్ పార్కు నిర్మాణం కోసం రూ.10 కోట్ల వరకు వెచ్చించడానికి తమ శాఖ సిద్ధంగా ఉందని అటవీ అధికారులు తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

ఈ ప్రాంతంలోని అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కొండగట్టు అర్బన్ పార్కు నిర్మించడానికి ఉన్నతాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేశాం. ఆలయ అధికారులు సహకరిస్తే అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించే పలు నిర్మాణాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

మొహినొద్దీన్, అటవీ శాఖ క్షేత్రాధికారి

# మహా నగరి.. ఆరోగ్య సిరి



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాన్ని వైద్య పర్యాటకంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేలా పర్యాటకశాఖ కార్యాచరణను రూపొందిస్తోంది. పదేళ్లలో వైద్యం కోసం వస్తున్న విదేశీయుల సంఖ్య రెట్టింపు అయింది. చికిత్స కోసం విదేశీయులు 2014 కేవలం 75 వేలమంది రాగా.. 2024 ఈ సంఖ్య 1.50 లక్షలకు పెరిగింది. నగరంలోని ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు, అత్యాధునిక సాంకేతికత, ఆసుపత్రుల్లో వసతులతో పాటు వైద్యానికి అయ్యే వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎక్కువమంది ఇక్కడికి వచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మరింత ఎక్కువమంది వైద్యం కోసం నగరానికి వచ్చేలా చేసేలా రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌ను వైద్య పర్యాటకం హబ్‌గా మార్చేలా దృష్టిసారించింది.

**వెల్‌నెస్ టూరిజానికి మరింత ప్రోత్సాహం**

ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించిన హెల్త్ టూరిజం సమిట్‌ను రాష్ట్ర నూతన పర్యాటక విధానం మేరకు వెల్‌నెస్ (మెడికల్) టూరిజాన్ని ప్రోత్సహించేలా నిర్వహించారు. ఆసుపత్రులు, వైద్య సంస్థలు, పర్యాటక ఆపరేటర్లు, విదేశీ ప్రతినిధులు, ఇతర దేశాల నుంచి ప్రతినిధులు, వైద్య నిపుణులు భాగస్వామ్యమయ్యారు. సదస్సులో వచ్చిన సూచనల మేరకు పర్యాటక శాఖ వైద్య పర్యాటకానికి కార్యాచరణను సిద్ధం చేస్తోంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, అంకాలజీ, ఫెర్టిలిటీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, కాలేయం సహా వివిధ స్పెషాలిటీలకు డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో వీటితో పాటు ఆయుర్వేదం, యోగా, యునానీ వంటి వాటికి వైద్యంలో ప్రాధాన్యం ఇచ్చేలా పర్యాటకశాఖ వివిధ సంస్థలతో చర్చిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలోని అనంతగిరిహిల్స్‌లో ప్రకృతి వైద్యం కోసం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌ను ఇందులో కీలకం చేయనున్నారు. వైద్యం కోసం వచ్చే వారి వీసా విధానం వైద్యం, వైద్య వసతులు, ఇతర అంశాల్లో తోడ్పాటును అందించడం వంటి అంశాల్లో పక్కా విధానం రూపొందిస్తారు.

## అతివ.. స్వయం ఉపాధి తోవ

మార్కండేయకాలనీ : మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు.. ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వశాఖ సంయుక్తంగా.. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లా మహిళా బాలిక సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఎన్టీపీసీలోని విక్టరీ ఇన్‌స్టిట్యూట్‌లో 60 మంది మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, ఎలక్ట్రికల్ మిషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. చదువుకున్న మహిళలకు డిప్లామా, పీజీ డిప్లామా కోర్సుల్లో కూడా అవకాశం కల్పిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి హాజరైన మహిళలు ప్యాషన్ డిజైన్, బొటిక్స్‌పై శిక్షణ పొందుతున్నారు. ఆరు నెలల శిక్షణ కాలం కాగా ప్రస్తుతం నాలుగు నెలల శిక్షణ పూర్తి చేస్తున్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారంతా స్వయం ఉపాధి, ప్రైవేటు, ప్రభుత్వ క్రాఫ్ట్ టీచర్లుగా ఉపాధి పొందవచ్చు.

నెక్ డిజైన్స్

స్లీవ్స్ ప్రిన్సెస్‌కట్ బ్యాక్‌లెస్‌బ్లౌజ్ హాల్టర్‌నెక్ జుబ్లా



పిల్లల టాప్స్, ఫ్రాక్స్, పట్యాల

ఎలక్ట్రికల్ మిషన్‌తో సులువుగా

మాది అంతర్గాం మండలం. మా ప్రాంతంలో బొటిక్ యంత్రం లేదు. ఏదైనా వర్క్ ఉంటే గోదావరిఖనికి వెళ్లాల్సిందే. ప్రస్తుతం జుబ్లా, ఫ్రాక్స్, కటింగ్, టాప్స్, పట్యాల, ఏకరూప దుస్తులు ఎలక్ట్రికల్ మిషన్‌తో సులువుగా కుట్టగలుగుతున్నా. బొటిక్ యంత్రంతో స్వయం ఉపాధి పొందాలని శిక్షణ పొందుతున్నాను.

స్రవంతి, అంతర్గాం

ఎవరి మీద ఆధారపడకుండా

మంథని నుంచి నిత్యం ఎన్టీపీసీ శిక్షణ కేంద్రానికి హాజరవుతున్నాను. కుట్టు మిషన్‌పై ఎలాంటి అవగాహన లేదు. ఇన్‌స్టిట్యూట్ శిక్షకురాలు వరలక్ష్మి మార్గదర్శకంలో చిన్నారుల ఏకరూప దుస్తులు, ప్రిన్సెస్‌కట్, స్టేట్ కటింగ్‌లో ప్రావీణ్యం పొందా. ఎవరి మీద ఆధారపడకుండా పీజీ డిప్లామా కోర్సుల్లో రాణించి వ్యాపారం చేయాలన్నదే నా లక్ష్యం.

సంధ్య, మంథని

60 మందికి శిక్షణ

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు ఫ్యాషన్ డిజైన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ఉన్నత చదువులు, నూతన టెక్నాలజీ అనుగుణంగా ఫ్యాషన్ డిజైన్ పీజీ డిప్లామా కోర్సు కూడా అందజేస్తున్నాం. ఇగ్నో విశ్వవిద్యాలయం నుంచి ధ్రువపత్రాలు పొందుతారు.దయ అరుణ, సమన్వయకర్త

## విజ్ఞాన ప్రదర్శనలు.. సృజనకు వేదికలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇందు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ చైతన్య జైని, ఏఎంఓ పెసర ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

18 తుది గడువు: విద్యార్థులు తమ పాఠశాల ఎంట్రీలను గూగుల్‌ఫాం లింక్ ద్వారా ఈనెల 18వ తేదీ రాత్రి 9 గంటల వరకు సమర్పించాలి. 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఒక థీమ్‌కు కేవలం ఒక ఎంట్రీ మాత్రమే అనుమతిస్తారు. కేవలం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మాత్రమే ఉంటుంది. ఆఫ్‌లైన్ ఎంట్రీ లేదు.

**ఇవీ లక్ష్యాలు..:** విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తిని రేకెత్తించటం, నూతన, వినూత్నమైన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఉపయోగపడతాయి. రీ సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచటం, సైన్స్ భావనలను వివిధ రూపాల్లో అనువర్తింప చేయటం

లాజికల్ రీజనింగ్ ద్వారా ప్రతి అంశంలో శాస్త్రీయ పద్ధతిని అనుసరించేలా ప్రోత్సాహం

విద్యార్థులు ప్రకృతిని అర్థం చేసుకునేందుకు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగటం, పరికల్పనలను రూపొందించట, ప్రయోగాలు చేయటం తదితర అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవటం.

దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యల నుంచి డేటాను సేకరించటం, దాన్ని విశ్లేషణ చేయటం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అలవరచుకోవటం.సైన్స్‌ను సమాజానికి అనుసంధానించటం, శాస్త్రీయ దృక్పత కోణంలో విస్తృత సామాజిక అవగాహన కోసం సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడతాయి.సైన్స్, గణితం అనేక విభిన్న వ్యక్తులు, సంస్కృతులు, సమాజాలు, పర్యావరణం ద్వారా ఎలా అభివృద్ధి చెందాయి, ప్రభావితమయ్యాయో విశ్లేషించటం.

వాతావరణ మార్పు, వ్యవసాయం, ఎరువులు, ఆహార ప్రాసెసింగ్, బయోటెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, సమాచారం, కమ్యూనికేషన్, రవాణా, క్రీడలు తదితర రంగాల్లో కొత్తమార్గాలను తెరవటం వంటి జీవిత సవాళ్లను ఎదుర్కోవటంలో సైన్స్, గణితం పాత్రను అభినందించటం.

2025-26 ఇతి వృత్తం

'వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ కోసం సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం

ఉప ఇతి వృత్తాలు రీ గ్రీన్ ఎనర్జీ

స్థిరమైన వ్యవసాయం

వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయాలు

ఉద్భవిస్తున్న సాంకేతికతలు

వినోద గణిత మోడలింగ్

ఆరోగ్యం, పరిశుభ్రత

నీటి సంరక్షణ, నిర్వహణ

సెమినార్ అంశం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించటం

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు, డీఎడ్/బీఎడ్ ఉపాధ్యాయ శిక్షణార్థులు కూడా తమ వినూత్నమైన బోధనాభ్యసన సామగ్రి భావనలకు వాస్తవ రూపం కల్పిస్తూ తయారు చేసిన ఎగ్జిబిట్స్ కూడా ప్రదర్శించవచ్చు. ఇవి మాత్రమే కాకుండా ఖమ్మం జిల్లా ప్రత్యేకంగా ఏఐ, రోబోటిక్స్ అనే అంశంపై కూడా పోటీలు నిర్వహిస్తోంది.

# దళారులెందుకు దండగ

హైదరాబాద్ : చిన్న ఇంటికి పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను చెల్లిస్తున్నామంటూ బాధపడే వారికి జీహెచ్ఎంసీ సులువైన పరిష్కారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది. దళారులతో పని లేకుండా జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌ను తెరచి.. ఆస్తిపన్ను సవరణకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. మ్యుటేషన్, పన్ను మినహాయింపు, మూతపడ్డ వ్యాపారానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సుల రద్దు వంటి సేవలకు ఆన్‌లైన్ దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది. మూడు వారాల కిందట జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ అర్జీలను అందుబాటులోకి తీసుకురాగా.. ఇప్పటికే రెండువేలకుపైగా దరఖాస్తులొచ్చాయి.



వ్యాపారం మూతపడితే..: వ్యాపారం మూతబడ్డాక ట్రేడ్ లైసెన్సు రద్దు చేయాలంటే ఇబ్బందులు ఉండేవి. బల్దియా వెబ్‌సైట్‌లో ఈ సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తులు కేంద్ర కార్యాలయానికి చేరుతుండగా.. నేరుగా అధికారులకు చేరేట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నామని ఓ ఉన్నతాధికాతో తెలిపారు.

వివాదాలకు పరిష్కారం

జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను రికార్డుల్లో 19లక్షల ఇళ్లున్నాయి. వాటి నుంచి వసూలవ్వాల్సిన ఆస్తిపన్ను విలువ రూ.2,250 కోట్లు. మొండి బకాయిలు మరో రూ.7వేల కోట్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ఇటీవల ప్రారంభించిన ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం విజయవంతమైతే.. పన్ను వివాదాలు 70శాతం మేర పరిష్కారమవుతాయని అంచనా.

# నిర్మించి.. విస్మరించి

హైదరాబాద్: నగరంలో గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల్లోని ఎస్టీపీలు నిరుపయోగంగా మారాయి. శుద్ధి అయ్యే నీటిని మరుగుదొడ్లు, గార్డెనింగ్, ఫ్లోర్ క్లీనింగ్ వంటి వాటికి వినియోగించుకోవచ్చు. బెంగళూరులో పెద్ద అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధిచేసిన నీటి వినియోగం తప్పనిసరి. మన నగరంలో పరిస్థితి పూర్తి భిన్నం. అసలు ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? లేదా? మురుగునీటి శుద్ధిలో పాటిస్తున్న ప్రమాణాలు, పునర్వినియోగం వంటివాటిని



పరిశీలించాల్సి ఉంది. తర్వాత థర్డ్‌పార్టీతో మదింపు చేయాలని జలమండలి నిర్ణయించినా అమలు కాలేదు.

**కారణాలు**శుద్ధి చేసిన నీటిని వినియోగించేందుకు ఆసక్తి చూపకపోవడం.ఎస్టీపీల నిర్వహణ వ్యయం, విద్యుత్ ఛార్జీలు ఎక్కువ అవుతుందనే అభిప్రాయం.బల్క్ కనెక్షన్లకు కావాల్సినంత నీటి సరఫరా.

వీటి నిర్వహణ గురించి పట్టించుకునే వ్యవస్థ లేకపోవడం.

# చెరువు శిఖం హాంఫట్

కోరుట్ల :జిల్లావ్యాప్తంగా సుమారు 1,226 చెరువులుండగా సగం మేర కబ్జా కోరల్లో ఉన్నాయి. వాటి చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని సుమారు ఆరేళ్ల కిందట కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీ నిర్ణయించింది. ఆ తర్వాత నిధులు లేవని చేతులెత్తేశారు. శిఖం భూమిని ఆనుకొని ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు.

**పల్లెల్లో పంటలు**

గ్రామాల్లో చెరువులు, కుంటలకు నీటిపారుదల శాఖ అధికారులు ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయలేదు.

శిఖం భూమి చుట్టూ పట్టా భూములున్న రైతులు కలిపేసుకొని పంటలు సాగు చేస్తున్నారు.

మత్తళ్లను ధ్వంసం చేయడంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం లేదు. కాలువలను చదును చేసి పంటలు సాగు చేస్తున్నారు.



చాలా గ్రామాల్లో చెరువుల ఒడ్డునే పాఠశాలలు, కార్యాలయాలు, రహదారులను నిర్మించడంతో ఆక్రమణకు గురవుతున్నాయి.


పట్టణాల్లో నిర్మాణాలుజగిత్యాల పట్టణం, శివారు గ్రామాల్లో 5 చెరువులుండగా, 4 ఆక్రమణకు గురయ్యాయి.మెట్‌పల్లిలో ఒక చెరువులో ఆక్రమణలు జరగగా నోటీసులు జారీ చేశారు. రెండు కుంటలను మట్టితో పూడ్చివేశారు.రాయికల్‌లో ఒక కుంట ఆక్రమణకు గురైంది. ధర్మపురిలో అయిదు చెరువులుండగా అన్ని చోట్లా కబ్జాల పర్వం సాగింది

బఫర్‌జోన్‌లో నిర్మించిన ఇళ్లకు మున్సిపల్ నుంచి నంబర్లు, కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. విద్యుత్తు మీటర్లు బిగిస్తున్నారు.

నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్థిరాస్తి వ్యాపారులకు వరంగా మారింది.

ఎఫ్‌టీఎల్ భూముల్లోని ఆక్రమణలను తొలగించినా తిరిగి నిర్మాణాలు వెలుస్తున్నాయి.చిత్రంలో కనిపిస్తోంది కోరుట్ల పట్టణ శివారులోని కంచరకుంట. చెరువు పైభాగంలో కొందరు మట్టితో ఎత్తు పెంచి అక్రమంగా షెడ్లు వేసుకున్నారు. చాలా ఏళ్లుగా వినాయక విగ్రహాల తయారీ, ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు. అక్రమ కట్టడాలను గతంలో పలుమార్లు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించినా పరిస్థితి మొదటికొచ్చింది.

# కొత్త కోర్సులతోనే ప్రయోజనం



వికారాబాద్ : జిల్లాలోని ఒకే ఒక్క ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన కోత్త కోర్సుల్లేక విద్యార్థులు నష్టపోతున్నారు. వికారాబాద్‌కు 2008లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశారు. 17 ఏళ్ల కిందట ఏ కోర్సులున్నాయో ఇప్పటికే అవే కొనసాగుతున్నాయి. కొత్త కోర్సులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**శివారెడ్డిపేట పారిశ్రామికవాడలో..**వికారాబాద్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయడంతో ప్రారంభంలో అరకొర సౌకర్యాలతో శివారెడ్డిపేట పారిశ్రామికవాడలోని షెడ్లలో తరగతులు నిర్వహించారు.

అనంతరం వికారాబాద్‌కు 6 కి.మీ.దూరంలోని కొంపల్లిలో పక్కా భవనం నిర్మించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని 2016లో ప్రారంభించారు. కళాశాల ప్రారంభంలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ కోర్సులు ఏర్పాటు చేశారు. మూడు కోర్సుల్లో కలిపి 180 సీట్లు ఉన్నాయి.

**అన్ని సౌకర్యాలున్నాయి..:** పాత కోర్సులతోపాటు కొత్తగా కంప్యూటర్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొత్త కోర్సులకు అవసరమైన సదుపాయాలున్నాయి. కళాశాల 8 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పక్కా భవనం, అత్యాధునిక వసతులతో ప్రయోగశాల ఉంది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థుల కోసం పక్కా వసతి గృహం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల కొనసాగుతోంది. పరిగి, తాండూరులో కొత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా విద్యార్థులు కోరుతున్నారు.

**విద్యార్థులకు మంచి అవకాశం..:** పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప వరం లాంటిది. డిప్లొమా తరవాత వెంటనే పరిశ్రమల్లో చేరే అవకాశముంటుంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చని, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేస్తే వెంటనే ఏదో పరిశ్రమలో ఉద్యోగం సులభంగా లభిస్తుందని కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, రోడ్డు, భవనాలు, ఎయిర్‌లైన్స్, మెట్రో, రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం, బీహెచ్ఈఎల్, ఎన్‌టీపీసీ, ఆర్మీ, నేవీ, సింగరేణి, కార్పొరేట్ సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని వారు తెలిపారు.

# పైసలిచ్చి.. రేషన్ కార్డులు పట్టి!



కరీంనగర్ : కరీంనగర్‌లో ఏటా రూ.కోట్ల టర్నోవర్ సాగించే ఓ వ్యాపారి రేషన్‌కార్డు తీసుకున్నారు. తనకు తెలిసిన వ్యక్తి ద్వారా ఈ కార్డును పొందారు. దళారికి రూ.5 వేలు ఇస్తే పని అయిపోయింది. పెద్దపల్లి పట్టణంలో చౌకధరల దుకాణాల వద్దకు కారులో వచ్చి నెల నెలా రేషన్ బియ్యం తీసుకెళ్తున్నారు. ఇటీవల కొత్తకార్డుల జారీ సమయంలోనూ ఇలాంటి వారు కార్డులు పొందారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిల్లో హెూటళ్లు, వస్త్ర వ్యాపారాలను నిర్వహించే వారిలో కొందరు రేషన్ కార్డులు తీసుకున్నారు. వారు ఏటా రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారే.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బడా నాయకులు, పెద్ద వ్యాపార కుటుంబాలకు చెందిన వారికి కూడా రేషన్ కార్డు రావడాన్ని చూసి విస్తుపోతున్నారు. ఏటా రూ.లక్షలు సంపాదించే వ్యాపారులు.. సొంత భవనాలు, భూములు ఉండి.. నెలకు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నవారు.. ఖరీదైన కార్లలో తిరిగేవారూ రేషన్ కార్డులు పొందారు.. అంగట్లో సరకు లెక్క దళారులు ధర కట్టడంతో డబ్బున్నవారు ఉపయోగించుకున్నారు.. కొన్నిచోట్ల మీసేవ కేంద్రాల నిర్వాహకులు.. ఇంకొన్ని చోట్ల తహసీల్దార్ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ దళారుల అవతారమెత్తారు.. డబ్బున్నవారినే కాదు.. తక్కువ ఆదాయం ఉన్నవారి నుంచీ 'అంతా మేమే చూసుకుంటాం' అని చెప్పి వసూళ్ల పర్వానికి తెరతీశారు. అనర్హులకు కార్డులు అందజేశారు.

**ఉమ్మడి జిల్లాలో..**

ఈ ఏడాది జనవరిలో 9,77,333 కార్డులు ఉండగా అక్టోబరు వరకు 10,98,293 కార్డులు అయ్యాయి. 1,20,960 పెరిగాయి.

ఈ ఏడాది జులైట్కు 14 నుంచి కొత్త కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నిరంతర ప్రక్రియ అవడం వల్ల ఇప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**కలెక్టర్ల దృష్టికి వెళ్లడంతో...**డబ్బులు తీసుకుని కార్డులు జారీ చేశారనే ఫిర్యాదులు జిల్లా కలెక్టర్లకు వెళ్లడంతో వీటి విషయమై దృష్టి సారించారు. కింది స్థాయి సిబ్బందితోపాటు దళారుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి మరింత లోతుగా ఆరా తీయాలని ఆర్డీవోలు, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వోలను ఆదేశించినట్లు తెలిసింది. ముందుగా కొన్ని చౌకధరల దుకాణాలకు ఎంపిక చేసుకుని వాటిల్లో పరిశీలించే దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు.

# అసంపూర్తిగా కొన్ని.. మొదలుకానివి మరిన్ని



మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి స్థానికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అవతల గ్రామాలకు, పొలాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పక్షం రోజుల క్రితం కూడా వాగులోకి భారీగా నీరురావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.80 కోట్లు మంజూరు చేసింది. ఈ వంతెన పూర్తయితే మెట్‌పల్లి వాసులు కోనరావుపేట, కథలాపూర్ మండలం, వేములవాడ పుణ్యక్షేత్రానికి వెళ్లటానికి దూరభారం తగ్గుతోంది.

మెట్‌పల్లి మండలం ఏఎస్ఆర్ తండా కల్వర్టుపై వంతెన నిర్మాణానికి 2022లో రూ.81 లక్షలు మంజూరయ్యాయి. కాని ఇప్పటి వరకు పనుల్లో కదలిక లేదు. ఏటా కల్వర్టుపై నుంచి నీరు పారి రాకపోకలు నిలిచిపోతుండడంతో తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. పదిహేను రోజుల క్రితం భారీ వర్షానికి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. వంతెన పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పలు గ్రామాలకు వానకాలంలో రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. రాకపోకలు సజావుగా సాగాలంటే ఆయా మార్గాల్లో అవసరమైన చోట వారధులు అవసరం ఉండగా.. నిధులు మంజూరైనా పనులు మొదలవటం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో కల్వర్టులపై ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పారి ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మరికొన్ని వంతెనల పనులు ప్రారంభమై అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిధులు మంజూరైనా పనులు చేపట్టడానికి గుత్తేదారులు ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పీఆర్ డీఈ రమణారెడ్డిని సంప్రదించగా.. ప్రారంభం కాని పనుల నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు.

**ఎక్కడెక్కడంటే..**

మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులో వాగుపై వంతెన పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. వంతెన పూర్తవగా.. ఇరువైపులా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వంతెనపై అక్కడక్కడ ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి.

ఆత్మకూర్-పాటిమీదితండా మధ్య కల్వర్టు స్థానంలో వంతెనకు 2022లో రూ.53 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించలేదు. చింతలపేట శివారులో ఆర్అండ్‌బీ రహదారిపై వంతెన పనులు అసంపూర్తిగా మిగిలాయి.మల్లాపూర్ మండలం రాఘవపేట-చిట్టాపూర్, సిరిపూర్-నడికుడ, వాల్గొండ-గొర్రెపల్లి, మల్లాపూర్-గొర్రెపల్లి బైపాస్‌రోడ్డు వంతెన పనులు చేపట్టాలి.

బ్రహీంపట్నం-వర్షకొండ ఆర్అండ్‌బీ రహదారి మధ్య రెండు కల్వర్టుల స్థానంలో వంతెనలకు రూ.2 కోట్ల చొప్పున మంజూరైనా పరిస్థితి యథావిధిగా ఉంది. యామాపూర్-ఫకీర్‌కొండాపూర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.కోరుట్ల మండలం సంగెం-ఏఖీన్‌పూర్ వంతెనకు రూ.1.50 కోట్లు మంజూరైనా పనులు మొదలుకాలేదు.

# రక్తశుద్ధి.. ఆరోగ్య సిద్ధి

సిరిసిల్ల : మారుతున్న జీవన శైలితో మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు రోజురోజుకు పెరుగుతున్నారు. క్రమం తప్పకుండా రక్తశుద్ధి చేసుకుంటేనే ప్రాణాలు నిలుస్తాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక రక్తశుద్ధి కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. అనువైన ఆసుపత్రుల వివరాలు కోరింది. ప్రస్తుతం కరీంనగర్, పెద్దపల్లి, మంథని, గోదావరిఖని, హుజూరాబాద్, జగిత్యాల, కోరుట్లలోని జిల్లా, జనరల్ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తశుద్ధి సేవలు అందుతున్నాయి. వీటితోపాటు గంభీరావుపేట, మెట్పల్లి, జమ్మికుంటలలో ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలు పంపింది.

ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఒకరికి నాలుగు గంటల చొప్పున స్లాట్ ఉంటుంది. ఇవే కాకుండా కరీంనగర్, జగిత్యాల, ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రక్తశుద్ధి కేంద్రాలున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ వర్తించక చాలా మంది రోగులకు ఉచిత సేవలు అందడంలేదు.

బాధితులకు రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉంచేందుకు కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు బోధనాసుపత్రుల్లోనూ అదనపు పడకలు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో గంభీరావుపేట, మెట్పల్లి, జమ్మికుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను గుర్తించారు. రక్తశుద్ధి కేంద్రంలో 24 గంటల



వైద్యసేవలు అందుబాటులో ఉండాలి. ఎంపిక చేసిన ఆసుపత్రులను 24 గంటల సేవలకు అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది.


రక్తశుద్ధి కేంద్రాల ఏర్పాటుపై రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పెంచలయ్యతో మాట్లాడగా రక్తశుద్ధి చేసుకునేవారి సంఖ్య పెరగడంతో ప్రభుత్వం కొత్త కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టిందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడు డయాలసిస్ కేంద్రాలు పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో నిర్వహిస్తున్నారు. వీటిల్లోని 45 పడకల్లో రోజుకు నాలుగు షిఫ్టుల్లో 329 మందికి రక్తశుద్ధి జరుగుతోంది. రాష్ట్రంలో అపెక్స్, సాబ్, డీసీడీసీ అనే మూడు ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీపీపీ పద్ధతిలో సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కొత్త కేంద్రాల ఏర్పాటుకు డీసీడీసీ సంస్థ ముందుకొచ్చింది.

# భర్తగా భరిస్తాడు.. తండ్రిగా తరిస్తాడు...

మిర్యాలగూడ : భర్తగా..తండ్రిగా..అన్నగా..తమ్ముడిగా.. తాతగా.. కార్యాలయంలో ఉద్యోగిగా.. సరిహద్దులో సైనికుడిగా.. గేటు ముందు రక్షకుడిగా.. సమాజంలో అనేక రకాల బాధ్యతలు నిర్వర్తించే మగాడు.. మగవారి బాధ్యతలు, వారు పడే కష్టాలు, వేదనను ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఏటా నవంబరు 19న 'అంతర్జాతీయ పురుషుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

లింగ సమానత్వం పెరుగుతున్న కొద్దీ.. పురుషుల్లో అనేక మార్పులు వచ్చి మహిళలను తమతో సమానంగా చూస్తున్నారు. కొన్ని మినహాయిస్తే మిగిలిన ఏ రంగంలోనూ.. అంశంలోనూ మహిళలు.. పురుషులకు తీసిపోని విధంగా ఉన్నారు. ఎన్నో కష్టాలను దిగమింగుకొని.. కన్నీళ్లు బయటకు రానీయకుండా.. కుటుంబం కోసం అహర్నిశలు కృషి చేసే మగవారు సమాజంలో చాలా మంది ఉన్నారు. కొందరు మృగాళ్లు చేసే నేరాలను.. పురుష జాతి మొత్తానికి అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం కుటుంబం కోసం తపించే పురుషులు ఎందరో ఉన్నారు.

కుమారుడిగా జన్మనిచ్చిన తల్లికే మొదటి ఓటు వేయాలి కానీ.. భర్తగా భార్యను ఓదార్చాల్సిన, ఒప్పించాల్సి బాధ్యత పురుషుడిదే. అన్నలా.. కుటుంబానికి అండగా నిలవాలి. తమ్ముడిలా అన్ని బాధ్యతలు చేపట్టాలి. తండ్రిగా పిల్లల ఉన్నతికి కృషి చేయాలి. తాతగా ఇంటిల్లిపాదికి ఆదర్శంగా నిలవాలి. ఉద్యోగిగా ఎలాంటి ఆశలకు లొంగకుండా కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలి. ప్రజా ప్రతినిధిగా తన స్వార్థం కోసం కాకుండా.. ప్రజల సంక్షేమం కోసం పాటు పడాలి. రైతుగా ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. సైనికుడిగా ప్రజలకు



భయం లేని రక్షణ ఇవ్వాలి.

ఉమ్మడి జిల్లా వివరాలు.. (సుమారు..లక్షల్లో)

పురుష ఓటర్లు: 14.63

యువత: 8.5

పిల్లలు: 5.80

వృద్ధులు: 3.5

పురుషుడికి తగిన ప్రాధాన్యం దక్కాల్సిందే

చారుగుండ్ల రాజశేఖర్, సైకాలజిస్టు, కోదాడ

నాటి నేటి పరిస్థితుల్లో ఎంతో తేడా వస్తున్నందున మగవారికి సైతం తగిన ప్రాధాన్యం దక్కాల్సిందే. తల్లి ప్రేమ ముందు..తండ్రి బాధ్యత చిన్నబోతుంది.. అనే నానుడి ప్రకారమే మగాడు ఎంత కష్టపడినా..అది చిన్నదిగానే కనిపిస్తుంది. ఓర్పుకు మారు పేరు, మార్పుకు మార్గదర్శి మగాడు. పిల్లల జీవితానికి దృఢమైన పునాది వేసే నాన్న కూడా ఓ మగాడే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పురుషుల రక్షణకు సైతం ప్రత్యేక చట్టాలు రావాల్సిన అవసరముంది.

# సైబర్ కేసుల పరిష్కారం, రీఫండ్‌లో హైదరాబాద్‌దే అగ్రస్థానం

నారాయణగూడ: ప్రత్యేక లోక్ అదాలత్‌లో హైదరాబాద్ కమిషనరేట్ అత్యధికంగా 11,226 కేసులు పరిష్కరించి అన్ని కమిషనరేట్లలో ప్రథమ స్థానంలో నిలిచింది. సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్(సీసీపీఎస్), హైదరాబాద్ నగర జోనల్ సైబర్ సెల్స్ కలిసి 709 కేసులు పరిష్కరించి రూ.5,77,78,601.23 రీఫండ్ డబ్బును బాధితులకు అందించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు అదనపు పోలీసు కమిషనర్(క్రైమ్స్) ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో సీసీపీఎస్ 40 కేసులను కంపౌండ్/కాంప్రమైజ్ చేసి, బాధితులకు రూ.1.98,04,148 మొత్తాన్ని, లోక్ అదాలత్‌కు ముందు సైబర్ పోలీసులు మరో 275 కేసుల్లో రూ.3,07,91,283, జోనల్ సైబర్ సెల్స్ 394 కేసుల్లో రూ.71,83,170 విజయవంతంగా రీఫండ్ చేసినట్లు వివరించారు. డీసీపీ (సైబర్ క్రైమ్స్), హైదరాబాద్ సిటీతో పాటు అన్ని జోనల్ డీసీపీల నిరంతర పర్యవేక్షణ, సమర్థ మార్గదర్శనం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పోలీసు శాఖ హైదరాబాద్ కమిషనరేట్ భవిష్యత్తులో సైబర్ నేరాల దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా త్వరితగతిన న్యాయం అందేలా అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.




అమరావతి: జీవితంలో విలువలు ఎంతో ముఖ్యమని.. వాటిని విద్యార్థులు ఆచరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రపాలెం గ్రామంలో ఉన్న డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగశాలను ప్రారంభించారు. డాన్ బాస్కో పాఠశాల వ్యవస్థాపక ఛైర్మన్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయురాలు మంజుల, అధ్యాపకులు, మంత్రి నారాయణ, రాజిరెడ్డి కారణమన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్లను సత్కరించారు.





అమరావతి, డిసెంబరు13 : చింతూరు టూ మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాత్రి వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణం చేయకుండా ఆంక్షల ఉత్తర్వులు జారీ చేశారు చింతూరు ఐటీడీఏపీవో శుభం నోక్‌వాల్. భద్రాచలం నుంచి రాత్రి వేళ ఆంధ్రప్రదేశ్ వెళ్లే వాహనదారులకు ఆంక్షలపై ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది. ప్రజా భద్రత కోసం ఆంక్షలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీ సర్కార్ తెలిపింది. అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ ప్రయాణంపై ఆంక్షలు ఉండనున్నాయి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని ఏపీ సర్కార్ సూచించింది.కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో నిన్న(శుక్రవారం) తెల్లవారు జామున బస్సు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందగా.. 20మందికి తీవ్ర గాయాలయ్యాయి.




## మూడవ రోజుకు దీక్ష విరమణలు.. తరలివచ్చిన భవానీలు

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో భవానీ దీక్ష విరమణలు మూడవ రోజుకు చేరుకున్నాయి. దీక్ష విరమించేందుకు పెద్ద ఎత్తున భవానీలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దీంతో కనుచూపు మేరకు ఎర్రటి దుస్తులలో భవానీలు నిండిపోయారు. వారాంతం కావడంతో భవానీలు పెద్ద సంఖ్యలో దుర్గమ్మ సన్నిధికి తరలివచ్చారు. దీంతో జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. తెల్లవారుజాము నుంచే భవానీలు విజయవాడకు తరలివచ్చి అమ్మను దర్శించుకుని దీక్షను విరమిస్తున్నారు. ముందుగా గిరి ప్రదక్షిణ చేసుకుని ఆపై అమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో భవానీలు వేచి ఉన్నారు. దుర్గమ్మ దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత కొండ దిగువకు చేరుకుని ఇరుముడులు సమర్పిస్తున్నారు. ఇక భవానీల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భవాని భక్తులు ఇరుముడులు సమర్పించేందుకు ప్రత్యేక కౌంటర్లు , కేశఖండనశాల, ఘాట్లలో షవర్ బాతులు, లడ్డు ప్రసాదాల కౌంటర్లు, మూడు హెూమగుండాలను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా.. ఐదు రోజుల పాటు భవానీ దీక్ష విరమణలు కొనసాగనున్నాయి. ఈనెల 11న దీక్ష విరమణలు ప్రారంభంకాగా 15వ తేదీన ముగియనుంది. అగ్ని ప్రతిష్టాపనతో ఇరుముడులు మొదలయ్యాయి.




## జరీబు భూముల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం: కేంద్ర మంత్రి పెమ్మసాని

అమరావతి: జరీబు భూముల సమస్యల పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నేల స్వభావంపై పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉండవల్లి లేఅవుట్ అభివృద్ధి ప్రారంభమైందని పేర్కొన్నారు. లంక భూముల సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. 7 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని వివరించారు. “భూసమీకరణ చేయని భూముల్లో ప్లాట్లు పొందిన వారి సమస్య పెండింగ్‌లో ఉంది. అక్కడ రైతులతో ఎమ్మెల్యే, మంత్రి మాట్లాడాక భూసేకరణకు వెళ్తాం. వేరే చోట్ల ప్లాట్లు కావాలని అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయించే చర్యలు తీసుకుంటాం. పెద్ద ప్లాట్లు పొందేవారు కొంత సమయం వేచి ఉండాలి. కమర్షియల్ ప్లాట్లలో వాస్తు ప్రకారం ఉండాలని కొందరు అడిగారు. 7 ఎకరాల మేర ప్లాట్లు మార్చాల్సి ఉంటుంది. రైతులు మళ్లీ వాస్తు పేరిట రావొద్దని కోరుతున్నాం. 26 గ్రామాల్లో అభివృద్ధి పనుల డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. వారంలో డీపీఆర్‌లు సిద్ధం చేసి నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం. సామాజిక అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాలు నిర్మిస్తాం. వీటికి భూమి, నిధులు సమకూరుస్తాం. రాజధాని గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్య పెంచుతాం” అని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

**వీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేశాం: మంత్రి నారాయణ...** భూసమీకరణ చేయని భూముల్లో 921 ప్లాట్లు రైతులకు వచ్చాయని మంత్రి నారాయణ అన్నారు. రైతుల నుంచి వీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేశామన్నారు. “వేరే చోట ప్లాట్లు తీసుకోవడానికి కొందరు సమ్మతించారు. కొందరు రైతులు వేచి చూస్తామని తెలిపారు. మరికొందరు తర్వాత చెబుతామన్నారు. రైతులకు కేటాయించిన వాటిలో 7,628 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది.

వేర్వేరు కారణాలతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు. 1,697 ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎఫ్ఎస్ఐ పెంచాలని కొందరు రైతులు అడిగారు” అని నారాయణ తెలిపారు.




అమరావతి: ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును డిసెంబర్ 12వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామం తంబాళహట్టికి చెందిన జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గ్రామానికి రోడ్డు వేయాలని వినతి చేశారు. అయితే, తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. దీపిక విజ్ఞప్తిని స్వీకరించిన పవన్ కళ్యాణ్ ఆ సాయంత్రానికే రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. గ్రామానికి నాణ్యమైన రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం విజ్ఞప్తి చేయగా.. ఆ సాయంత్రానికే రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చేలా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవడంతో దీపికతో పాటు ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో డిసెంబర్ 12వ తేదిన క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించారు. ఒక్కో క్రికెటర్‌కు రూ. 5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు.

అంతేకాకుండా, ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను కూడా అందించి వారిని ప్రత్యేకంగా సత్కరించారు.

## చంద్రబాబు విధానాలే నా విజయానికి కారణం: మంత్రి కొండపల్లి




అమరావతి, డిసెంబర్ 13: ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్ పోలో మంత్రి మాట్లాడుతూ.. పాతికేళ్ళ క్రితం చంద్రబాబు ఎలా ఆలోచించారో చూశామని.. ఐటీకి భవిష్యత్తు ఉంటుందని, నాటి యువతను ప్రోత్సహించారని గుర్తుచేశారు. అవసరమైన మౌళిక సదుపాయాలను ఆ నాడు ఏర్పాటు చేశారని తెలిపారు. తాను ఐటీ రంగంలో 16 ఏళ్ళు రాణించానంటే చంద్రబాబు నాయుడు ఆనాడు ఏర్పాటు చేసిన విధానాలే కారణమని చెప్పుకొచ్చారు. ప్రతీ ప్రొడక్ట్ కూడా భారత సమాజంలో విక్రయించే అవకాశం ఉంటుందని.. ప్రపంచంలో వాడే ప్రతీ వస్తువు భారత్‌లో వినియోగిస్తారని తెలిపారు. భారత్ వైపు ప్రపంచం చూస్తోందన్నారు. భారత్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలని.. భారత్ మార్కెట్‌లో ఎలా అడుగు పెట్టాలనే దానిపై ప్రపంచ దేశాలు చూస్తున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని పని చేస్తున్నారని అన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఏరో స్పేస్, బయో టెక్నాలజీ ఇలా అనేక రంగాల్లో క్లస్టర్‌లను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడు పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నారన్నారు. చిన్న తరహా పరిశ్రమలు అన్నీ ఆ దిశగా అడుగులు వేయాలని.. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని సూచనలు చేశారు. పెద్ద పరిశ్రమలు వచ్చే దగ్గర చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని.. వాటిని చిన్న తరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో మంచి డిమాండ్ ఉందని.. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా పని చేయాలన్నారు. భారత్‌లో అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ ఎక్కువగా తయారు అవుతాయని.. వీటికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా అడుగులు వేయాలని చెప్పుకొచ్చారు. స్థానిక ఉత్పత్తులను గుర్తించి వాటికి తగ్గట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు వెళ్లి.. ఉన్న సమస్యలు అక్కడ వివరిస్తే.. పారిశ్రామిక భవిష్యత్తుకు కావాల్సిన పరిష్కారాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటువంటి సిద్ధాంతం ప్రపంచంలో జర్మనీలో ఉందన్నారు. విద్యార్థులను పారిశ్రామిక రంగానికి అనుసంధానం చేసే వ్యవస్థ ఇది అని తెలిపారు. మంత్రి నారా లోకేష్.. ఈ వ్యవస్థను దగ్గర ఉండి మానిటర్ చేస్తూ ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను కేటాయించారని చెప్పారు. వెంచర్ క్యాపిటల్ క్రియేట్ చేసి.. మానిటైజ్ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఏ విధంగా అడుగులు వేస్తుందో తెలుసుకోవాలని అన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త విధానాన్ని అందరూ వాడుకోవాలని... యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని అన్నారు. మీ ఐడియాకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యరూపం ఇస్తుందన్నారు. రుణ, మార్కెట్, ప్రాజెక్ట్ తయారీ సహా ఇతర సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. మార్కెట్‌ను ఏ విధంగా పెంచుకోవాలనే దానిపై అందరూ కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## కర్నూలులో అతిపెద్ద పరిపాలనా భవనం: మంత్రి ఆనం



కర్నూలు, డిసెంబర్ 13: విజయవాడ తరువాత కర్నూలులో అతిపెద్ద పరిపాలన భవనం ఏర్పాటు చేశామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నగరంలో ఏపీ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలన భవన సముదాయాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీజీ భరత్ ఈరోజు (శనివారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దేవాదాయ శాఖలో 95శాతం అమలు చేశామని చెప్పారు. వైదిక, ఆగమ శాస్త్రం ద్వారా ఉత్సవాలు, పూజా కార్యక్రమాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నిర్యాణం రోజును ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర?యించారని అన్నారు. అర్చకులకు కనీస వేతనం కింద రూ.15 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర?యించిందని తెలిపారు. వేద విద్య నేర్చుకున్న వారికి సంభావణ రూపంలో రూ.3 వేలు ఇస్తున్నామన్నారు. టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్ కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ భూములను పరివేక్షణ చేయడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం రిటైర్డ్ ఐఎస్ఐను నియమించామని అన్నారు. పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టాలని నిర?యించామని.. రూ. 595 కోట్లతో 490 ఆలయాలను పునర్నిర్మాణం చేయబోతున్నామని వెల్లడించారు.

888 జీవో అమలుపై నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

**మా ప్రభుత్వంతోనే సాధ్యం: మంత్రి టీజీ భరత్...** గత ప్రభుత్వంలో అన్నీ శంకుస్థాపనలకే పరిమితమయ్యాయని.. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నింటినీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. రూ. 5 కోట్లతో దేవాదాయశాఖ పరిపాలన భవనం ప్రారంభించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి తమ ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వమే కొనసాగితే రాష్ట్రం అభివృద్ధిలో దేశంలో టాప్‌లో ఉంటుందని తెలిపారు. రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

కాగా.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, దస్తగిరి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ డా.సిరి, శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాస్ రావు, ఛైర్మన్ రమేష్ నాయుడు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పులులు, సింహాలన్నారు.. గ్రామ సింహాలయ్యారు.. కొడాలిపై మంత్రి ఎద్దేవా

అమరావతి, డిసెంబర్ 13: మాజీ మంత్రి కొడాలి నానికి కార్మికశాఖ మంత్రి సుభాష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సంతోషం కోసం కొడాలి నాని నోటికి వచ్చినట్టు బూతులు మాట్లాడారని మండిపడ్డారు. రెడ్ బుక్ పేరెత్తితేనే గజగజ లాడిపోతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. అవాకులు చవాకులు పేలాటం ఎందుకు ఇప్పుడు డైపర్లు వేసుకు తిరగడం ఎందుకు అంటూ ఎద్దేవా చేశారు. పులులు, సింహాలు అంటూ ఇప్పుడు గ్రామ సింహాలుగా మారిపోయారంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. ముందు యోగా, వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకో అంటూ కొడాలి నానికి హితవుపలికారు. మెడికల్ కాలేజీల విషయంలో వైసీపీ నేతల సంతకాల సేకరణ ఓ బోగస్ అని అన్నారు. వైసీపీ కార్యకర్తలు సంతకాలు పెట్టి పెట్టి వాళ్ళ చేతులు పడిపోతున్నాయంటూ ఎద్దేవా చేశారు. 151 యొక్క సీట్ల నుంచి 11 సీట్లకు ఎందుకు దిగజారేమో సంతకాల సేకరించాలని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి విషయంలో విశాఖ దూసుకుపోతోందన్నారు. వైసీపీ హయాంలో విశాఖను గంజాయి హబ్‌గా, కబ్జాలకు కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. విశాఖ అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని ఫైర్ అయ్యారు. కక్ష సాధింపు చర్యలలో భాగంగా చంద్రబాబుపై పెట్టిన కేసులు ఒక్కొకటిగా వీగిపోతున్నాయని తెలిపారు. చంద్రబాబుని చూసి నేర్చుకుంటే ఇంకో 25 సంవత్సరాల తర్వాత అయినా అధికారం కోసం పోటీపడే అవకాశం ఉంటుంది అంటూ మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

# బార్బీ బొమ్మలా మారిన జాన్వీ!

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో దివంగత నటీమణి శ్రీదేవి, ప్రముఖ బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్ దంపతుల వారసురాలు జాన్వీకపూర్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా అడుగు పెట్టకు ముందు పలు ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించిన ఈమె.. పలు యాడ్స్ లో కూడా నటించి భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. హీరోయిన్ గా బాలీవుడ్ రంగ ప్రవేశం చేసిన జాన్వీ కపూర్ అతి తక్కువ సమయంలోనే అక్కడ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది అని చెప్పవచ్చు. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ తో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇన్స్టాగ్రామ్ లో భారీ ఫాలోవర్స్ ను కలిగి ఉన్న జాన్వీ కపూర్ దీనిద్వారా బాగానే ఆర్జిస్తోందని చెప్పవచ్చు. ఒకానొక సమయంలో ఇన్స్టాగ్రామ్ ద్వారా వచ్చే ఆదాయంతోనే ఈఎంఐలు కడుతున్నానని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది కూడా. ఇప్పుడు బాలీవుడ్ లోనే కాదు టాలీవుడ్ లో కూడా అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది.. ఇదిలా ఉండగా తాజాగా ఇన్స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలు షేర్ చేసిన జాన్వీ కపూర్ అందులో ఎల్లో కలర్ మినీ ఫ్రాక్ ధరించి అచ్చం బార్బీ బొమ్మలా కనిపించింది. అమ్మడి అందానికి అభిమానులే కాదు ఫాలోవర్స్, నెటిజన్స్ కూడా ఫిదా అవుతున్నారు.



జాన్వీకపూర్ ఎలాంటి డ్రెస్ వేసినా మరింత అందంగా కనిపిస్తుందని కామెంట్లు చేస్తున్నారు. ఒకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూనే.. మరొకవైపు గ్లామర్ లుక్కుతో ఆకట్టుకునే ఈమె ఇప్పుడు ఏకంగా బార్బీ లుక్ లో కనిపించేసరికి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ కి చెందిన ఈ ఇన్స్టాగ్రామ్ ఫోటోల సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించిన ఈమె.. ఇటీవల టాలీవుడ్ లో కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన దేవర సినిమాతో అడుగుపెట్టి.. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. అంతేకాదు ఈ సినిమా కోసం ఏకంగా 5 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. అలాగే బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న విడుదల కాబోతోంది. అలాగే నాని ది ప్యారడైజ్ సినిమాలో కూడా హీరోయిన్గా అవకాశం అందుకుంది జాన్వీ కపూర్. ఇటు బాలీవుడ్ విషయానికి వస్తే.. పరమ్ సుందరి, సన్నీ సంస్కారికి తులసీ కుమారి , హోమ్ బౌండ్ అంటే వరుసగా మూడు చిత్రాలు చేసింది. కానీ ఏ చిత్రం కూడా ప్రేక్షకులను మెప్పించ లేకపోయింది. ఇప్పుడు భక్త్ అనే మరో చిత్రంలో నటిస్తోంది. మరి ఈ సినిమా నైనా ఈమెకు బాలీవుడ్లో మంచి విజయాన్ని అందిస్తుందో ఏమో చూడాలి.

# ఆ బ్యూటీ ఇండస్ట్రీ జర్నీ అలా!

అలయా.ఎఫ్ బాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. పర్ఫెక్ట్ క్రిత కెరీర్ ప్రారంభమైనా అమ్మడు నిలదొక్కుకోవడానికి ఐదేళ్ల సమయం పట్టింది. ఐదేళ్లగా నటిగా బిజీ అయింది. జవానీ జనేమన్, ఫ్రెడీ, అల్మోస్ట్ ప్యార్ విత్ డి మెహబాబ్ చిత్రాల్లో నటించింది. అటు పై బడేమియాన్ చోటే మియాన్, శ్రీకాంత్ లాంటి చిత్రాలతో మరింత పాపులర్ అయింది. ప్రస్తుతం అమ్మడికి అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఎలాంటి ఛాన్సులొచ్చినా నో చెప్పకుండా కమిట్ అవుతుంది. మరి ఈ బ్యూటీ సినిమాల్లోకి రావడానికి అసలు కారణం ఏంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం తెలిసింది. తొలుత అలయాకి సినిమాలంటేనే పెద్దగా ఆసక్తి ఉండేది కాదంట. ఆ సమయంలో అమ్మడు క్రిష్ చిత్రం థియేటర్లో చూసిందట. ఆ సినిమా బాలీవుడ్ పై ఆశలు కలిగించినట్లు పేర్కొంది. ఆ చిత్రాన్ని తన బాల్యాన్ని గుర్తించే చిత్రంగా భావిస్తానంది. తనకు ఇష్టమైన నటులు ఆ సినిమాలో నటించడమే తనకు ప్రేరణ కలిగించిందంది. క్రిష్ రిలీజ్ అనంతరం హృతిక్ రోషన్, ప్రియాంక చోప్రాలకు అభిమానులుగా మారినట్లు తెలిపింది.



అప్పుడే అలయా పరిశ్రమను ఇష్టపడటం మొదలు పెట్టినట్లు తెలిపింది.క్రిష్ సినిమా కంటే ముందు తన స్నేహితులు చాలా మంది బాలీవుడ్ కి ఫిదా అయ్యేవారు కానీ తాను మాత్రం సినిమాల పట్ల పెద్దగా ఆసక్తిగా ఉండేదాన్ని కాదంది. క్రిష్ తనలో సినిమాల్లోకి రావాలనే ఆశ పుట్టించడంతో మ్యాకప్ వేసుకున్నట్లు తెలిపింది. అలయా .ఎఫ్ ఇండస్ట్రీ బిడ్డ అన్న సంగతి తెలిసిందే. నటి పూజాబేడి కుమార్తె. పూజాబేడి బాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ కాదు గానీ కొన్ని టీవీ షోలను హోస్ట్ చేసి ఫేమస్ అయ్యారు.

ఇలా కుటుంబంలో నటనా రంగం నుంచి ఉంటే పిల్లలు కూడా అదే వృత్తిని ఎంచుకోవడం సహజం . కానీ అలయా మాత్రం అనుకోకుండా సినిమాల్లోకి వచ్చింది. తల్లి ప్రభావం తనపై ఎంత మాత్రం లేదని అలయా మాటల్ని బట్టి తెలుస్తోంది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేని నటిగానే బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు తాను అభిమానించిన హృతిక్ రోషన్ తోనే కలిసి ఓ ప్రాజెక్ట్ కి పని చేస్తోంది. హృతిక్ నటిస్తోన్న ఓ వెబ్ సిరీస్ లో జోడీగా నటిస్తోంది.




# ట్రెండీ టాక్: 2026లో ఘనమైన ఓపెనర్ ఎవరు?







బాలీవుడ్ కి ఏడాది ముగింపు ఉత్సాహం నింపింది. 2025 డిసెంబర్ లో రణ్ వీర్ దురంధర్ విజయం హిందీ చిత్రసీమలో ఉత్సాహం పెంచింది. పాన్ ఇండియన్ ట్రెండ్ లో టైర్ 2 నగరాల్లోను హిందీ సినిమాలను తెలుగు ప్రజలు ఆదరిస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. తీవ్రవాదం, దేశభక్తి నేపథ్యంలో నిజకథతో రూపొందించిన దురంధర్ గురించి ఇటీవల తెలుగు యువతలోను ఎక్కువగా చర్చ సాగుతోంది. కంటెంట్ ఎంపిక సరైనది అయితే, కచ్చితంగా బ్లాక్ బస్టర్ సాధ్యమేనని దురంధర్ నిరూపిస్తోంది. సినిమాల రిలీజ్ లకు డిసెంబర్ ప్రారంభం ఎప్పుడూ అనుకూలం కాదు. కానీ దురంధర్ ఈ నెలలోనే విడుదలై కేవలం మంచి కంటెంట్ కారణంగా ఇంత పెద్ద విజయం అందుకుందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. గతంలోను ఇదే డిసెంబర్ లో విడుదలైన యానిమల్, పుష్ప 2 చిత్రాలు సంచలన విజయాలు సాధించిన సంగతి తెలిసిందే. మంచి కంటెంట్ ఉన్న సినిమాలకు సీజన్, అన్ సీజన్ అనే రూల్స్ వర్తించవని ఈ సినిమాలు నిరూపించాయి. యానిమల్, పుష్ప 2, దురంధర్ చిత్రాలు.. వాటిలో నటించిన హీరోల కెరీర్ బెస్ట్ హిట్స్ గా నిలిచాయి. అయితే ఏడాది ముగింపును దురంధర్ తన ఖాతాలో వేసుకోగా, ఇతర సినీపరిశ్రమల నుంచి అంతగా ఆడిన సినిమాలేవీ లేవు. ఈ డిసెంబర్ లో విడుదలైన చిత్రాలలో టాలీవుడ్ నుంచిరామ్ కథానాయకుడిగా నటించిన ఆంధ్రా కింగ్ తాలూకా మంచి సమీక్షలతో ఉత్సాహం నింపింది. ఇతర సినిమాలు ఇలా వచ్చి అలా వెళ్లినవే. అయితే దురంధర్ స్థాయి విజయాలేవీ భారతీయ సినీపరిశ్రమల్లో రాలేదు. అందుకే జనవరిలో ఘనమైన ఓపెనింగును అందించే సినిమా ఏది? అన్న చర్చ మొదలైంది. దురంధర్ స్థాయి విజయం అందుకునే సినిమా ఏదైనా సంక్రాంతి బరిలో వస్తోందా? అన్న ఆసక్తికర చర్చ సాగుతోంది. జనవరి తెలుగు సినిమాలకు కలిసొచ్చే సీజన్. సంక్రాంతి పండుగకు వారం పొడవునా సెలవులు టాలీవుడ్ బాక్సాఫీస్ కి కలిసొస్తుంది. ఈ సంక్రాంతి సీజన్ లో వస్తున్న క్రేజీ సినిమా రాజా సాబ్ మరో దురంధర్ రేంజులో విజయం సాధిస్తుందా? అంటూ ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ బరిలో దిగుతున్నాడు గనుక ఘనమైన ఆరంగేట్రాన్ని ఇస్తాడని అంతా ఊహిస్తున్నారు. ప్రభాస్ ఈసారి రెగ్యులర్ యాక్షన్ సినిమాలకు భిన్నంగా హారర్ థ్రిల్లర్ తో అభిమానుల ముందుకు వస్తున్నాడు. 9 జనవరి 2026న విడుదలవుతున్న రాజా సాబ్ విన్యాసాలు బాక్సాఫీస్ వద్ద ఏ రేంజులో ఉండనున్నాయో వేచి చూడాలి. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన ట్రైలర్ కి అద్భుత స్పందన వచ్చింది. ఈ సినిమాతో పాటు మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న %-%మన శంకర వరప్రసాద్ గారు%-% సంక్రాంతి బరిలోనే విడుదల కానుంది. రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి కూడా సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. అయితే సైరాతో పాన్ ఇండియాలో పరిచయమైన చిరంజీవి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలోని కామెడీ ఎంటర్ టైనర్ తో ఏ స్థాయి విజయం అందుకుంటారో వేచి చూడాలి. అపజయమెరుగని దర్శకుడిగా అనీల్ రావిపూడి వరుస విజయాలను అందిస్తున్నాడు. అందువల్ల చిరుతో అనీల్ కాంబినేషన్ మూవీపై భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ చిత్రంలో చిరంజీవి- వెంకటేష్ రేర్ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద భారీ మ్యాజిక్ చేయడానికి సహకరిస్తుందని కూడా ట్రేడ్ అంచనా వేస్తోంది. ఇక ఈ జనవరిలో అత్యంత క్రేజీగా పాన్ ఇండియాలో విడుదలవుతున్న మరో సినిమా జననాయకుడు. దళపతి విజయ్ నటనారంగాన్ని విడిచిపెట్టి పూర్తిగా రాజకీయాల్లోకి వెళుతున్న క్రమంలో జననాయగన్ చివరి సినిమా కాబోతోంది! అంటూ ప్రచారం సాగుతోంది. తమిళ తంబీలకు ఇది ఎమోషనల్ మూవ్ మెంట్ కాబోతోంది. అందుకే ఈ సంక్రాంతి బరిలో విజయ్ రికార్డులు సాధించడం సాధ్యమేనని అంచనా వేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జననాయగన్ చిత్రాన్ని 9జనవరి 2026న విడుదల చేస్తున్నారు. అఖండ తరహా కాన్సెప్టుతో రూపొందించిన ఈ సినిమా విజయ్ ఫ్యాన్స్ లో పూనకాలు పుట్టిస్తుందని అంచనా వేస్తున్నారు. దళపతి విజయ్ నటించిన ఇటీవలి సినిమాలు 250-300 కోట్ల మధ్య వసూలు చేస్తున్నాయి. దీనిని బట్టి జననాయకుడు సంక్రాంతి బరిలో అత్యంత భారీ వసూళ్లను సాధించే చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని భావిస్తున్నారు. 500 కోట్లు అంతకుమించి వసూలు చేసే సత్తా ఈ జనవరిలో ఏ సినిమాకి ఉంది? అన్నదే ఇప్పుడు ఆసక్తిని పెంచుతోంది. సంక్రాంతి బరిలో టాలీవుడ్ లో మూడు పెద్ద సినిమాలు నువ్వా నేనా? అంటూ పోటీపడనుండడం అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది. సంక్రాంతి సీజన్ ముగిశాక ఈ ఏడాదిలో మునుముందు భారీ చిత్రాల ట్రీట్ ఉంది. ప్రభాస్ - హను కాంబినేషన్ లోని ఫౌజీ, అల్లు అర్జున్-అట్లీ మూవీ, ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ పాన్ మూవీ ఇండియాలో సంచలనం సృష్టించే చిత్రాల జాబితాలో ఉన్నాయి. కానీ అంతకుముందే ఈ జనవరిలో ఘనమైన ఓపెనింగ్ చేసే సినిమా ఏది? అన్నది ఉత్కంఠను పెంచుతోంది.

# వెంకటేష్ ని అలా చూడగలరా.. గురూజీ ప్లాన్ ఏంటి..?



విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం తర్వాత త్రివిక్రమ్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబో మూవీని హారిక హాసిని బ్యానర్ తో పాటు ఫార్చ్యున్ ఫోర్ మూవీస్ కలిసి నిర్మిస్తున్నారు. రైటర్ గా ఉన్నప్పుడు వెంకటేష్ కి సూపర్ హిట్ సినిమాలు అందించిన త్రివిక్రమ్ ఇప్పుడు డైరెక్టర్ గా మరో సూపర్ హిట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. గుంటూరు కారం తర్వాత త్రివిక్రం కాస్త గ్యాప్ తీసుకుని వెంకటేష్ తో సినిమా చేస్తున్నారు.

**విక్టరీ వెంకటేష్ సెక్యూరిటీ గార్డ్ గా..** ఈ సినిమా కూడా ఒక మంచి ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్టైనర్ గా ఉంటుందట. ఫ్యామిలీ మొత్తం చూసే సినిమాగా ఇది తెరకెక్కిస్తున్నారు. ఐతే ఈ సినిమాలో వెంకటేష్ రోల్ గురించి ఒక లీక్ బయటకు వచ్చింది. సినిమాలో విక్టరీ వెంకటేష్ సెక్యూరిటీ గార్డ్ గా కనిపిస్తారట. వెంకటేష్ ఏంటి సెక్యూరిటీ గార్డ్ ఏంటి అనుకోవచ్చు. గురూజీ కథ కోసం హీరోల పాత్రలను టాక్సీ డ్రైవర్ లుగా చేస్తాడు.. అవసరమైతే సెక్యూరిటీ గార్డ్ గా కూడా చేస్తాడు. వెంకటేష్ 76 సినిమాల కెరీర్ లో ఇదివరకు ఎప్పుడు ఇలా సెక్యూరిటీ రోల్ చేసింది లేదు. బాడీ గార్డ్ గా చేసిన సందర్భాలు ఉన్నాయి కానీ సెక్యూరిటీ గార్డ్ గా మాత్రం చేయలేదు. ఐతే సినిమాలో ఆయన చేసే పాత్ర దాని చుట్టూ కథ చాలా బలంగా ఉంటాయని తెలుస్తుంది. అంతేకాదు వెంకటేష్ టైమింగ్ కు తగినట్టుగా త్రివిక్రమ్ మాటలు అదరగొట్టేస్తాయని తెలుస్తుంది. వెంకటేష్, త్రివిక్రమ్ ఈ కాంబో సినిమాపై ఆడియన్స్ పెట్టుకున్న అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉంటుందట.

**మన శంకర వరప్రసాద్ సినిమాలో వెంకటేష్ క్యామియో..** ఈ సినిమాలో వెంకటేష్ కి జతగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా లాక్ అయ్యింది. ఈమధ్యనే తెలుసు కదా సినిమాతో మెప్పించిన శ్రీనిధి నెక్స్ట్ వెంకటేష్ తో ఛాన్స్ అందుకుంది. త్రివిక్రమ్ సినిమాలో ఛాన్స్ అది కూడా వెంకటేష్ లాంటి స్టార్ తో స్క్రీన్ షేరింగ్ కాబట్టి శ్రీనిధికి ఈ సినిమా కలిసి వచ్చే అవకాశం ఉంది. వెంకటేష్ కూడా గురూజీ మీద పూర్తి నమ్మకం ఉంచేశాడని తెలుస్తుంది. ఈ సినిమాను నెక్స్ట్ సమ్మర్ కి రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారట. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకటేష్ మరోసారి అదే రేంజ్ సక్సెస్ ఈసారి త్రివిక్రమ్ డైరెక్షన్ సినిమాతో కొట్టాలని చూస్తున్నారు. మరి సినిమా ఎంతమేరకు ఈ కాంబో పై ఉన్న అంచనాలను అందుకుంటుందో చూడాలి. ఈ సినిమాతో పాటుగా వెంకటేష్ సంక్రాంతికి రిలీజ్ కాబోతున్న మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాలో క్యామియో రోల్ చేస్తున్నాడని తెలిసిందే. చిరంజీవి, వెంకటేష్ ఈ కాంబో స్క్రీన్ మీద అదరగొట్టేయడం ఖాయమని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు.

# గార్జియస్ లుక్ లో అమృత!


అమృత అయ్యర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో ఓవర్ నైట్ లోనే లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో యంగ్ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సినిమాలో హీరోయిన్గా నటించి మరోసారి ప్రేక్షకులను అబ్బురపరిచింది. ఈ సినిమాలో ఈమె నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. అంతేకాదు ఈ సినిమా తర్వాత ఆఫర్లు వరుసగా తలుపు తడతాయని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. ఇక బచ్చల మిల్లి సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్గా నటించినా కానీ ఈ సినిమా కూడా ఈమెకు కలిసి రాలేదని చెప్పాలి. ఇకపోతే అటు సినిమాలకు ఇటు సోషల్ మీడియాకి కూడా కాస్త దూరంగా ఉన్న ఈమె తాజాగా తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలను ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసుకుంది..ఆ ఫోటోలలో



చాలా గార్జియస్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది అమృత అయ్యర్. తాజాగా స్లీవ్ లెస్ ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ఈమె.. ఆ దుస్తులలో తన ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. బోల్డ్ స్లిట్ తో కప్పబడిన స్కర్ట్ ఆమెకు క్లాసీ లుక్కును అందించింది. ఈ గ్లామర్ లుక్కులో చాలా రిలాక్స్ గా కనిపించి సరికొత్త వైబ్ క్రియేట్ చేసింది అమృత అయ్యర్. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి చాలా రోజుల తర్వాత ఇలాంటి లుక్కులో చూసేసరికి అభిమానులు ఈ ఫోటోలను తెగ లైక్, షేర్ చేస్తున్నారు. అమృత అయ్యర్ విషయానికి వస్తే.. 1994 మే 14న తమిళనాడులోని చెన్నైలో తమిళ్ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. కర్ణాటకలోని బెంగళూరులో పెరిగిన ఈమె అక్కడే ఎన్ హెచ్ ఆర్ పాఠశాలలో స్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేసి, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో తమిళ చిత్రం పడైవీరన్ సినిమాతో తొలిసారి హీరోయిన్ గా అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత బిగిల్, లిఫ్ట్ వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.. రెడ్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే సినిమా చేసి ఆకట్టుకుంది. హనుమాన్ సినిమాతో వంద కోట్ల క్లబ్లో చేరిన ఈమె బచ్చల మిల్లి , అర్జున ఫాల్గుణ సినిమాలు చేసింది..

# ప్రభాస్ లైనప్ లో 'ఆ ఐదు' సీక్వెల్స్.. మరి స్పిరిట్ సంగతేంటి?

తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఆ బాహుబలి సినిమాతో ఫ్రాంచైజీ ట్రెండ్ ను స్టార్ట్ చేసిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇప్పుడు అందుకు ఆయన కేరాఫ్ అడ్రస్ గా నిలిచేలా కనిపిస్తున్నారు. బాహుబలితో ఫ్రాంచైజీ ట్రెండ్ తెలుగులో మొదలవ్వగా.. అందులో రెండు సినిమాలు చేశారు ప్రభాస్. మూడు భాగం కూడా చేసేలా ఉన్నారు. అయితే సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రభాస్ స్టార్ట్ చేసిన ఫ్రాంచైజీ ట్రెండ్ ను అనేక మంది స్టార్ హీరోలు ఫాలో అయ్యారు. ఇప్పటికీ దాన్ని ఫాలో అవుతున్నారు కూడా.. అనుకున్న సినిమాను పలు భాగాలుగా రిలీజ్ చేయడం.. పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయడం.. సూపర్ హిట్స్ అందుకోవడం కొంతకాలంగా జరుగుతోంది. అదే సమయంలో ప్రభాస్ మాత్రం బాహుబలి నుంచి ఫ్రాంచైజీ సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. బాహుబలి రెండు చిత్రాల తర్వాత నార్మల్ మూవీస్ సాహో, రాధేశ్యామ్, ఆదిపురుష్ చేసిన ప్రభాస్.. అనంతరం మళ్లీ సలార్ ఫ్రాంచైజీలో అడుగుపెట్టారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఆ సినిమా.. సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్ గా వచ్చింది. ఆ మూవీ సీక్వెల్ శౌర్యాంగ పర్వం షూటింగ్ మరికొద్ది రోజుల్లో మొదలవనుంది. సలార్ తర్వాత నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీలో నటించారు డార్లింగ్. ఆ మూవీ సీక్వెల్ కూడా ప్రభాస్ లైనప్ లో ఉంది. ఇప్పుడు ది రాజా సాబ్ లో ప్రభాస్ యాక్ట్ చేస్తుండగా.. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. అయితే ఆ సినిమాకు కూడా



సీక్వెల్ ఉన్నట్లు తెలుస్తోంది. మూవీ లాస్ట్ లో సీక్వెల్ కు లీడ్ ఇచ్చి ఫ్రాంచైజీని డైరెక్టర్ మారుతి కంటిన్యూ చేస్తారట. అదే సమయంలో ఇప్పుడు ప్రభాస్ ఫౌజీలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమాకు కూడా సీక్వెల్ ఉందని రీసెంట్ గా డైరెక్టర్ హను రాఘవపూడి ఓ ఇంటర్వ్యూలో పరోక్షంగా తెలిపారు. దీంతో మొత్తానికి ప్రభాస్ లైనప్ లో నాలుగు సినిమాల సీక్వెల్స్ ఉన్నాయనే చెప్పాలి. సలార్, కల్కి, రాజా సాబ్, ఫౌజీ ఫ్రాంచైజీల్లో డార్లింగ్ మరోసారి కనిపించనున్నారు. యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ సినిమా చేస్తారని కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తుండగా.. అది కూడా ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ అని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే డార్లింగ్ లైనప్ లో ఉన్న మరో మూవీ స్పిరిట్ సంగతేంటన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మాస్ యాక్షన్ పోలీస్ డ్రామాగా సినిమా రూపొందనుంది. ఆ మూవీకి సీక్వెల్ లేదా ప్రీక్వెల్ లేదా ఫ్రాంచైజీ ఉన్నట్లు ఇప్పటి వరకు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఎక్కడా మాట్లాడలేదు. దీంతో ఎలాంటి రూమర్స్ గానీ వార్తలు గానీ రావడం లేదు. మరి స్పిరిట్ విషయంలో సందీప్ వంగా ఏం చేస్తారో వేచి చూడాలి.



# హైదరాబాద్ చేరుకున్న లియోనెల్ మెస్సికి ఘనస్వాగతం

హైదరాబాద్: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అక్కడ వందమందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు మెస్సీ బృందం ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. మెస్సి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

కోల్‌కతాలో ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు బందోబస్తు పెంచారు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా మెస్సి భారత్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.





# రెండో విడత పంచాయతీ ఎన్నికలు.. సామగ్రి సిద్ధం

తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రిని అధికారులు పరిశీలిస్తున్నారు. అలానే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పట్టణాల్లో ఉంటున్న ప్రజలు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఏకగ్రీవాలు కాకుండా రెండో దశలో 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది.

**రెండో విడత పంచాయతీ ఎన్నికలు.. ఉప్పల్‌లో ప్రయాణికుల రద్దీ** : తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భాగ్యనగరంలో ఉంటున్న ప్రజలు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలోనే నగరంలోని జూబ్లీ బస్ స్టేషన్, ఉప్పల్ బస్ స్టాప్ వద్ద రద్దీ నెలకొంది. ఊళ్లకు వెళ్లే వారితో ఉప్పల్ ప్రాంతమంతా సందడిగా మారింది. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవాలు కాకుండా 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది.




అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం తెల్లవారుజామున అతడు కోల్‌కతాకు చేరుకున్నాడు. మెస్సితో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సువారెజ్ భారత్‌కు వచ్చారు. 14 ఏళ్ల తర్వాత భారత్‌కు వచ్చిన మెస్సిని చూడటానికి విమానాశ్రయానికి అభిమానులు వందల సంఖ్యలో తరలివచ్చారు.

అర్జెంటీనా జెండాలను చేతబూని 'మెస్సి మెస్సి' అంటూ నినాదాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. కోల్‌కతాలోని ఓ ఫైవ్‌స్టార్ హెూటల్‌లో మెస్సి బృందం బస చేసింది. ఉదయం లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్‌ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా మెస్సి అక్కడికి వెళ్లలేదు. తర్వాత సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ గంగూలీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీలను కలుస్తాడు. శనివారం కోల్‌కతాలో కార్యక్రమం ముగియగానే మెస్సి హైదరాబాద్ బయలుదేరతాడు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటాడు. ఆ తర్వాత గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆడతాడు. ఉప్పల్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఆడతారు. మొత్తం 72 గంటల కంటే తక్కువే భారత్‌లో గడిపే మెస్సి.. కోల్‌కతా, హైదరాబాద్‌తో పాటు, ముంబయి, దిల్లీల్లోను పర్యటిస్తాడు. 14న ముంబయిలో, 15న దిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటాడు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవడంతో గోట్ పర్యటన ముగుస్తుంది.

# సీఎం రేవంత్ రెడ్డికి మెస్సీ మీద ఉన్న ప్రేమ బీసీల మీద లేదు.. శ్రీనివాస్ గౌడ్ ఫైర్

సీఎం రేవంత్ రెడ్డికి మెస్సీ మీద ఉన్న ప్రేమ బీసీల మీద లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం సాయి ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్నాడని.. అయినా వారి కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చలేదని మండిపడ్డారు. బీసీ బీఆర్ఎస్ నాయకులు వద్దిరాజు రవిచంద్ర, ఎల్.రమణ, పొన్నాల లక్ష్మయ్యతో కలిసి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకునేందుకు నల్గొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త అయిన బీసీ వ్యక్తితో మూత్రం తాగించారని మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. జనగణనలో బీసీలను తక్కువ చేసి చూపించారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీ ఓట్లతోనే కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఎంత శాతం రిజర్వేషన్లు ఇచ్చారో రాహుల్ గాంధీ తెలుసుకోవాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి రాహుల్‌గాంధీకి చెప్పాలన్నారు. బీసీలను తక్కువ చేసి చూయించిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి చిత్త శుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ అమలుపై పార్లమెంట్‌లోఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలను బొంద పెట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాహుల్‌గాంధీకి ఫుట్‌బాల్ మ్యాచ్ చూసే టైమ్ ఉంది కానీ.. బీసీలకు ఇచ్చిన హామీలపై లేదని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ బీసీలతో రోజూ ఫుట్‌బాల్ ఆడుతున్నారని ధ్వజమెత్తారు.




# అన్ని విషయాలు బయటపెడతా.. ఈటల రాజేందర్ షాకింగ్ కామెంట్స్

హనుమకొండ, డిసెంబరు13 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పీఆర్వో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ ఎంపీనని... తాను కూడా కొన్ని పోస్టులను చూశానని ప్రస్తావించారు. అవగాహన లేకుండా కొంతమంది తనపై కుట్ర పూరితంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇవాళ(శనివారం) కమలాపూర్‌లో ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు ఈటల రాజేందర్.

**అలా పోస్టులు పెడతారా..?..** వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. అవగాహన ఉన్నవారు అలా పోస్టులు పెడతారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తాను ఏ పార్టీలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ అంశాలను బీజేపీ హై కమాండ్ తేలుస్తుందని.. సమయమే ఇది డిసైడ్ చేస్తుందని వ్యాఖ్యానించారు. తనపై ఎవరు ఏమి చేస్తున్నారు.. ఎవరేం చెబుతున్నారో ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. రెండు, మూడో విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యాక ఇటీవల జరిగిన పరిణామాలన్నీ తాను చెబుతానని పేర్కొన్నారు ఈటల రాజేందర్. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లని కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌పై ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఫలితాలను బట్టి అర్థం చేసుకోవాలని చెప్పుకొచ్చారు. సింగరేణిలో క్వార్టర్స్ బాగుచేయడానికి పైసలు లేవా అని ప్రశ్నించారు. సింగరేణి డబ్బులతో తన ఫుట్‌బాల్ ట్రైనింగ్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి వందల కోట్లు ఖర్చు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు కోట్ల రూపాయలు దోపిడి చేశారని కవిత ఆరోపిస్తున్నారని అన్నారు ఈటల రాజేందర్.

**కాంగ్రెస్ సర్కార్ పేదల ఇళ్లను కూలుస్తుందా..?...** ఆరోపణలు వస్తున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. జీతాలు ఇవ్వడానికి కూడా డబ్బులు లేవని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వల్లకాడులా మారే పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పేదల ఇళ్లను కూలుస్తుందా?.. పెద్దల ఆస్తులను కాపాడుతుందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల అభివృద్ధిలో తన వంతు సహకారం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. తన స్వగ్రామం కమలాపూర్‌లో తనను తొక్కేయాలని చూశారని ఆరోపించారు. కొంతమంది తన గురించి మాట్లాడారని.. వాళ్లను ప్రజలు తొక్కేశారని విమర్శించారు. నిస్వార్థంతో పనిచేసే తమ అభ్యర్థులను గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు ఈటల రాజేందర్.

**సీఎం ఈవెంట్ మేనేజర్ లాగా మారారు..** సీఎం రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజర్ లాగా మారారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పైసలు లేకున్నా రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజ్‌మెంట్ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీడియాలో మేనేజ్ చేయడం తప్పా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు ఈటల రాజేందర్.

**బీఆర్ఎస్ ప్రలోభాలు..** పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్ని ప్రలోభాలు పెట్టిన బీజేపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారని చెప్పుకొచ్చారు. ఐదు గ్రామాల్లో స్వతంత్ర అభ్యర్థులకు తాము మద్దతు ఇచ్చామని.. వారు గెలిచారని తెలిపారు. గెలిచిన సర్పంచ్‌లకు రూ. 5 నుంచి రూ.10 లక్షలు ఇస్తామని బీఆర్ఎస్‌లోకి రావాలని చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకతతో మొదటి విడతలో 50 శాతం సీట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు ఈటల రాజేందర్.




# మాటలతో యుద్ధాలు గెలవలేం: పాక్‌కు సీడీఎస్ చురక

హైదరాబాద్: మాటలతో యుద్ధాలు గెలవలేమని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పాకిస్థాన్‌కు చురకలు అంటించారు. స్పష్టమైన చర్యలతో మాత్రమే విజయం సాధ్యమని యువ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, ప్రణాళిక, వేగంగా కచ్చితమైన నిర్ణయాలను అమలుచేయడం ద్వారా అసలైన దృఢత్వం లభిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ.. తామే విజయం సాధించామంటూ ఆ దేశం ప్రకటనలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సీడీఎస్ నుంచి స్పందన వచ్చింది. బలహీన వ్యవస్థల కారణంగా ప్రపంచంలోని పలు ప్రాంతాలు అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతున్నాయని, దానివల్ల తరచూ అభద్రత, ఘర్షణాత్మక పరిస్థితులు కనిపిస్తుంటాయని దాయాదికి కౌంటర్ ఇచ్చారు. "అదే సమయంలో మనకు స్థిరమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది. సాయుధ దళాల నైపుణ్యం, దృఢమైన వ్యవస్థలు భారత్ బలం. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పులను భారత బలగాలు అందిపుచ్చుకుంటున్నాయి" అని చౌహాన్ అన్నారు.

**ఇప్పటి వరకూ ఒక్క అధికారిపైనా కోప్పడలేదు..** ఈ సందర్భంగా కొత్తగా విధుల్లోకి చేరనున్న యువ అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే దేశ సేవకు తమ పిల్లల్ని అందించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. "ఈ అకాడమీలో క్యాడెట్లకు అత్యుత్తమ శిక్షణ అందింది. విధిలో నిర్లక్ష్యం పనికిరాదు. ఎవరు చేసే తప్పులకు వారే బాధ్యులు అవుతారు. ఒకప్పుడు యుద్ధాలు క్షేత్రస్థాయిలో జరిగేవి. కానీ ఇప్పుడు సాంకేతికతదే కీలకపాత్ర. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడూ అలర్ట్‌గా ఉండాలి" అని సూచనలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు గట్టిగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# మరోసారి గొప్ప మనసు చాటుకున్న జగ్గారెడ్డి.. సర్పంచ్‌గా ఓడిన అభ్యర్థికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి




సంగారెడ్డి: సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మరోసారి గొప్ప మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆదుకుంటూ నిత్యం ప్రజల మధ్యలో ఉండే జగ్గారెడ్డి ఇటు పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలకు, నాయకులకు అదే రీతిలో అండగా ఉంటానని మరోసారి నిరూపించుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గ కొండాపూర్ గ్రామానికి చెందిన మస్కు నరసింహారెడ్డి ఆయన సతీమణి అలివేణినీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా బరిలో నిలిపారు. అయితే ఎన్నికల ఫలితాల్లో కేవలం 22 ఓట్లతో ఆమె ఓటమిపాలయ్యారు. శనివారం మల్కాపూర్ శివారులో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల, జగ్గారెడ్డిల ఆధ్వర్యంలో ఎన్నికల్లో గెలిచి.. వారందరికీ పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొండాపూర్‌లో ఓటమిపాలై నిరాశకు లోనైనా నరసింహారెడ్డిని జగ్గారెడ్డి తన అక్కున చేర్చుకుని ప్రస్తుతం ఖాళీగా ఉన్న సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అందజేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. ఇదిలా ఉంటే సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సదాకుల కుమార్ ఎన్నికల ముందు వరకు ఆ పదవిలో కొనసాగారు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా మల్కాపూర్ నుంచి సర్పంచ్ పదవి కోసం పోటీ చేశారు. దీంతో ఆ పదవి కాలం ఇంకా మూడు నెలలు ఉండగా.. మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది. దానిని భర్తీ చేయాలనే ఉద్దేశంతో తన ప్రధాన అనుచరుడైన నరసింహారెడ్డికి జగ్గారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అందజేస్తూ ప్రకటన చేయడంతో సభలో అందరూ ఒక్కసారిగా గట్టిగా చప్పట్లు కొట్టి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.




అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో పాల్గొంటున్నాడు. ఈనేపథ్యంలో మెస్సిని దగ్గరి నుంచి చూడాలని, అతడి ఆటను వీక్షించాలని కొన్ని రోజులుగా అభిమానులు ఎదురుచూశారు. ఇలాంటి సమయంలో అతడు అలా వచ్చి.. ఇలా స్టేడియం నుంచి వెళ్లిపోవడాన్ని అభిమానులు తట్టుకోలేకపోయారు. స్టేడియంలో పట్టుమని 10 నిమిషాలు కూడా ఉండలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుర్చీలు, వాటర్ బాటిళ్లు విసిరేసి తమ అసహనం వ్యక్తంచేశారు. శనివారం కోల్‌కతాలోని వివేకానంద యువభారతి సాల్ట్ లేక్ స్టేడియంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజామున కోల్‌కతాలో దిగిన మెస్సి.. ఉదయం 11.30 గంటల సమయంలో సాల్ట్ లేక్ స్టేడియానికి వెళ్లాడు. అప్పటికే భారీ స్థాయిలో అభిమానులు అక్కడికి తరలివచ్చారు. రాజకీయ నేతలు, ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారులు, కోచ్‌లు, ఇతర సభ్యులు ఆయన్ను చుట్టుముట్టడంతో స్టాండ్స్ నుంచి ఈ స్టార్‌ను చూసే అవకాశం అభిమానులకు లభించలేదు. అతడి చుట్టూ ఉన్నవారిని దూరం జరిపే ప్రయత్నాలు జరిగినప్పటికీ అవికూడా ఫలించలేదు. ఈ గందరగోళ పరిస్థితుల వల్ల ముందుగా నిర్ణయించిన రెండు ఈవెంట్లను నిర్వహించలేకపోయారు. భద్రతా కారణాల దృష్ట్యా 10 నిమిషాల్లోనే అతడిని నిర్వాహకులు స్టేడియం నుంచి తీసుకెళ్లిపోయారు. అతడు వెళ్లిపోవడాన్ని చూసిన అభిమానులు సహనం కోల్పోయారు. టికెట్ కోసం భారీగా వెచ్చించి, కొన్ని గంటల పాటు వేచి చూసినవారు.. కనీసం మెస్సి నోటి నుంచి ఒక్క మాట కూడా వినలేకపోవడం వారిని అసహనానికి గురిచేసింది. అతడు వెళ్లగానే సాల్ట్ లేక్‌లోకి దూసుకొచ్చారు. అక్కడ ఏర్పాటుచేసిన టెంట్లు, ఇతర తాత్కాలిక నిర్మాణాలను ధ్వంసం చేశారు. అక్కడి భద్రతా సిబ్బంది వారిని నియంత్రించలేకపోవడంతో గంటపాటు ఈ గందరగోళం కొనసాగింది. ఈ ఈవెంట్ కోసం ఒక్కొక్కరూ రూ.4,500 నుంచి రూ.10వేల వరకు వెచ్చించారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను గవర్నర్ ఆదేశించారు. కాగా.. మొత్తం 72 గంటల కంటే తక్కువే భారత్‌లో గడిపే మెస్సి.. కోల్‌కతా, హైదరాబాద్‌తో పాటు, ముంబయి, దిల్లీల్లోను పర్యటిస్తాడు. 14న ముంబయిలో, 15న దిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటాడు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవడంతో గోట్ పర్యటన ముగుస్తుంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com